https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 303 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం, సెప్టెంబర్,3, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




# రాజీనామా కోరలేదు..

## అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా

### మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కొండా సురేఖ



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,02:** కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## ఆ విమానాశ్రయాల

# పనులు వేగవంతం చేయండి

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్



ఢిల్లీ, సెప్టెంబర్ 2 : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్-అమెరికా మధ్య వాణిజ్య బంధం

## ఈ నెలాఖరులో అమెరికాకు పీయూష్ గోయల్!



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,02:** భారత్–అమెరికా దేశాలు న్యాయమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు సన్నిహితంగా పనిచేస్తున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య అవగాహనపై ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించామని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నారని ఆయన తెలిపారు. ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 66వ వార్షిక సమావేశంలో సెర్గియో గోర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "న్యాయమైన, పరస్పర ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చే వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు మా రెండు ప్రభుత్వాలు సన్నిహితంగా కలిసి పనిచేస్తున్నాయి. ఇది ఇంకా అధికారికంగా ప్రకటించారా లేదా నాకు తెలియదు. కానీ మంత్రి పీయూష్ గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. జీ20 చర్చల నేపథ్యంలో అమెరికాతో చర్చలను కొనసాగిస్తారు" అని సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రభుత్వాలు ఇప్పటికే కుదుర్చుకున్న వాణిజ్య అవగాహనతో పాటు పలు అంశాల్లో వాస్తవమైన పురోగతి సాధించామని తెలిపారు. భారత్–అమెరికా మధ్య పురోగతి కేవలం వస్తువుల వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాలేదని గోర్ అన్నారు. ఇరు దేశాలు దాదాపు అన్ని రంగాల్లో కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది భారత్, అమెరికా 'ఘుఖ్ రాఆశ్రీఅఘ్' డిక్లరేషన్‌పై సంతకం చేశాయని తెలిపారు. ఆవిష్కరణలకు అనుకూలమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ఇది కీలక ముందడుగు అని చెప్పారు. ఈ డిక్లరేషన్ వల్ల భారత్–అమెరికా కంపెనీలు పరస్పరం సరిహద్దులు దాటి పెట్టుబడులు పెట్టుకోవడం సులభతరం అవుతుందని గోర్ వివరించారు. అలాగే ఇరు దేశాల్లోని కొత్త తరం పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. భారత్–అమెరికా సంబంధాలు వాణిజ్యానికి మించి సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో మరింత విస్తరిస్తున్నాయని సెర్గియో గోర్ పేర్కొన్నారు.

## 22ఎ భూములపై అసెంబ్లీలో

# ఏం మాట్లాడతారో రండి..

### బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్



హైదరాబాద్,సెప్టెంబర్ 2 : 22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.

'మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు.

## పౌరసత్వంపై ట్రంప్ కఠిన వైఖరి

# పిల్లల పాస్‌పోర్ట్‌కు తల్లిదండ్రుల పౌరసత్వం




**న్యూఢిల్లీ,సెప్టెంబర్,02:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వాన్ని పరిమితం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో కీలక ప్రతిపాదనను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇకపై అమెరికాలో జన్మించిన పిల్లలకు పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు.. తల్లిదండ్రులు తమ పౌరసత్వం లేదా ఇమ్మిగ్రేషన్ హోదాకు సంబంధించిన ఆధారాలను సమర్పించాల్సి రావొచ్చు. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ప్రతిపాదన రూపొందిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం అమెరికాలో పుట్టిన పిల్లలకు పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసే తల్లిదండ్రులు.. తమకు, చిన్నారికి మధ్య ఉన్న సంబంధాన్ని నిరూపించడంతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును సమర్పించాలి. దరఖాస్తు ఫారంలో తల్లిదండ్రుల పౌరసత్వ హోదాను కూడా వెల్లడించాలి. అయితే తమ ఇమ్మిగ్రేషన్ స్థితిని నిరూపించే పత్రాలను సాధారణంగా సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే ట్రంప్ ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాల ప్రకారం ఈ విధానంలో మార్పులు చేయాలని భావిస్తోంది. పిల్లవాడు ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పరిధిలోకి వస్తాడా లేదా అనే విషయాన్ని నిర్ణయించేందుకు తల్లిదండ్రుల వివరాలతో పాటు వారి పౌరసత్వం లేదా ఇమ్మిగ్రేషన్ హోదాకు సంబంధించిన ఆధారాలను కూడా సేకరించాలని ప్రతిపాదించింది.

## రైతులు, టీచర్లపై కేసుల్ని

# ఎత్తేసిన తమిళనాడు సర్కార్..



**చెన్నై,,సెప్టెంబర్,02:** తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతులు, ఉపాధ్యాయులపై ఉన్న కేసుల్ని ఎత్తేశారు. జీవనోపాధి, హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా చేపట్టిన ఆందోళనలకు సంబంధించి 2021 మే నుంచి 2026 ఏప్రిల్ మధ్య నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. మానవతా దృక్పథంతో పాటు ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం రైతులు, టీచర్లపై అనేక కేసులు నమోదు చేసిందని విజయ్ విమర్శించారు. వారి ప్రజాస్వామ్య హక్కులు హరించబడ్డాయని, కేసుల కారణంగా ఇప్పటికే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు, టీచర్ల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తిరువణ్ణామలై జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్‌కు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన ఆందోళనల్ని విజయ్ ప్రశ్నించారు. ఈ నిరసనల్లో కొందరు రైతులపై గుండాస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారని చెప్పారు. పరందూర్‌లో ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా రైతులు చేసిన ఆందోళనల కేసులను కూడా ఉపసంహరిస్తామని విజయ్ ప్రకటించారు. విమానాశ్రయం కారణంగా వ్యవసాయ భూములు, నీటి వనరులు, జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కేసుల ఉపసంహరణ ప్రజాస్వామ్య హక్కులపై మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలుకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకాన్ని పెంచుతుందని విజయ్ అన్నారు.

# రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి సీఈవోగా ఎయిర్ మార్షల్



**లక్నో,సెప్టెంబర్,02:** రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. భారత వైమానిక దళంలో పలు కీలకమైన కమాండింగ్ బాధ్యతలు నిర్వహించిన ఈ మాజీ అధికారి, 'ఆపరేషన్ సింధూర్' సమయంలో వెస్ట్రన్ కమాండ్ అధిపతిగా వ్యవహరించారు. అయోధ్య విరాళాల చోరీకి సంబంధించిన వివాదంతో తీవ్రంగా దెబ్బతిన్న ఆలయ నిర్వహణ, ఆర్థిక జవాబుదారీతనాన్ని పటిష్టం చేయాల్సిన కీలక బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది. ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) మిశ్రా 1986 డిసెంబర్‌లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా నియమితులయ్యారు. 38 ఏళ్లకు పైగా సేవలందించిన అనంతరం, ఆయన 2026 మేలో భారత వైమానిక దళం నుండి పదవీ విరమణ చేశారు. ఆయన పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్, అమెరికాలోని ఎయిర్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ పూర్వ విద్యార్థి.

# హైదరాబాద్‌లో ఆ భూముల ధరలకు రెక్కలు.



హైదరాబాద్, సెప్టెంబర్ 2: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)లో హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ వచ్చింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఈ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయించడం హాట్‌టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో భూముల ధరలు ఏ స్థాయిలో ఉన్నాయో మరోసారి స్పష్టం చేసింది. అధికారులు నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఒక్కో గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, వేలంలో పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగా పెరిగాయి. అత్యధికంగా ఒక ప్లాట్ గజం రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. మరో ప్లాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయించారు. అదేవిధంగా మరో రెండు ప్లాట్లు గజం రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. ఈ వేలంలో మొత్తం 19 మంది బిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాట్ల కోసం పోటీపడ్డారు. ఈ పోటీ కారణంగా హౌసింగ్ బోర్డు నిర్దేశించిన కనీస ధర కంటే అనేక ప్లాట్లు అధిక ధరలకు విక్రయమయ్యాయి. మొత్తం 16 ప్లాట్ల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది. వేలంలో గజం సగటు ధర రూ.1.79 లక్షలుగా నమోదైంది.

# "అమ్మకు అక్షరమాల" కార్యక్రమాన్ని గోవురు లో ప్రారంభం

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 2 (డీకే చాటింపు): 100 రోజుల్లో 100% అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో, గ్రామంలో గుర్తించిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది, ప్రతి ఒక్కరూ కనీసం ఐదుగురు నిరక్షరాస్యులకు చదువు నేర్పే విధంగా "ఋఖఎష్ట్ర ాఅవ ఎఘఎష్ట్ర ఖీఅజవ" కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహ సొసైటీ గారి సౌజన్యం తో కుట్టు శిక్షణ కేంద్రాన్ని కూడా ప్రారంభించడం జరిగింది. అక్షరాస్యతతో పాటు మహిళలు మరియు గ్రామీణ ప్రజలకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సి ఈ వో సాయ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప సంచాలకులు వయోజన విద్య ఏ పురుషోత్తం గోవూర్ సర్పంచ్ రవి , లీడ్ బ్యాంకు మేనేజర్ టాస్క్ కోఆర్డినేటర్ ఎంపీడీవో, ఎంఈఓ ,మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మకు అక్షరమాల, నిరక్షరాస్యుల గుర్తింపు మరియు నమోదు,



లిటరసీ లెర్నింగ్ సెంటర్ ద్వారా అక్షరాస్యత తరగతులు, ఈచ్ వన్ టీచ్ పై కార్యక్రమం అమలుపై అవగాహన కల్పించడం జరిగింది. మోస్ర మండలాన్ని 100 రోజుల్లో 100% అక్షరాస్యత సాధించే మండలం గా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు, అధికారులు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు మరియు ప్రజలుసమన్వయం తో పనిచేయాలని పిలుపు నివ్వడం జరిగింది

# వినాయక నిమజ్జనం సాఫీగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి --

## బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి..!

ఎల్బీనగర్, సెప్టెంబర్ 2 (డికె చాటింపు) గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరూర్నగర్ చెరువు వద్ద నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సాఫీగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కోరారు.బుధవారం ఉదయం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సరూర్నగర్ చెరువు వద్ద సంబంధిత అధికారులతో కలిసి పర్యటించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించి చేపట్టాల్సిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గత సంవత్సరం గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సరైన ఏర్పాట్లు, అధికారుల మధ్య సమన్వయం లోపించడం వల్ల నిమజ్జనం సమయంలో వినాయక విగ్రహాలు పడిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈసారి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో పోలీసు, మున్సిపల్, శానిటేషన్ మరియు ఇతర సంబంధిత శాఖలు సమిష్టిగా పనిచేసి భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం సరూర్నగర్ చెరువు వద్ద జరుగుతున్న



బండ్ పనులను పరిశీలించి, నిమజ్జనానికి ముందే పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ ఎస్.ఈ నాగేందర్, ఈ.ఈ కార్తీక్, శానిటేషన్ డి.ఈ చందన, తాజా మాజీ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి, , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలుకూరి రాంరెడ్డి, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ప్రదీప్, వెంకన్న, సుధాకర్, చిలజూరి మధుసూదన్ రెడ్డి, ధనరాజు, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు గవర్ధన్, కిట్టు, ప్రవీణ్ గౌడ్, దామ రాకేష్ యాదవ్, రఘునందన్ జోషి, వంశీ గంగపుత్ర, ఆదర్శ్, పవన్ మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో నూతన బేకరీని ప్రారంభించిన భవాని ప్రవీణ్ కుమార్

## ప్రభుత్వ ఉద్యోగాల కోసమే సమయాన్ని వృథా చేయకుండా..

## స్వయం ఉపాధితో పదిమందికి మార్గదర్శకంగా నిలవాలని " యువతకు పిలుపు!

ఎల్బీనగర్, సెప్టెంబర్ 2 (డికె చాటింపు) కొత్తపేట సర్వీస్ రోడ్డులో ప్రసాద్ అనే యువకుడు నూతనంగా ఏర్పాటు చేసిన బేకరీకి గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై బేకరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బేకరీ యజమాని ప్రసాద్ గారు భవాని ప్రవీణ్ కుమార్ కి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భవాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ: నేటి యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే నిరీక్షిస్తూ విలువైన సమయాన్ని, జీవితాన్ని వృథా చేసుకోవద్దు. సొంత కాళ్లపై నిలబడి స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి. ప్రసాద్ లాంటి యువకులు స్వయంకృషితో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి, క్రమశిక్షణతో కష్టపడి ఆర్థికంగా ఎదగడం ఎంతో అభినందనీయం. ఇలాంటి వ్యాపారాల ద్వారా తాము స్థిరపడటమే కాకుండా మరికొంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. నూతన బేకరీని ఏర్పాటు చేసిన ప్రసాద్‌కి నా హృదయపూర్వక శుభాకాంక్షలు."ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం డివిజన్ బిఆర్ఎస్ యువజన నాయకులు, ప్రసాద్ గారి మిత్రులు పాల్గొన్నారు..



# కానిస్టేబుల్ - సబ్- ఇన్స్పెక్టర్స్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ కొరకు3 న స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 2 (డికె చాటింపు) నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష ఉత్తీర్ణతులైన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం నిజామాబాదు లోని ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు తేదీ :- 03-09-2026, రోజున ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మూడు డివిజన్లోని (నిజామాబాద్, ఆర్మూర్, బోధన్) అభ్యర్థులు హాజరు కావాలేను. ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో ఉత్తీర్ణతులైన అభ్యర్థులు తమ వెంట రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, మరియు ఆధార్ కార్డు జిరాక్స్, క్యాస్ట్ సర్టిఫికెట్ జిరాక్స్, ఎస్ఎస్సి మెమో జిరాక్స్, ఇంటర్ మెమో జిరాక్స్, డిగ్రీ మెమో జిరాక్స్, తమ వెంట తీసుకొని రాగలరు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని పి.సాయి చైతన్య ,ఐ.పీ.ఎస్ తెలియజేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్క్రీనింగ్ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం నిజామాబాదు లోని ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు తేదీ :- 03-09-2026, రోజున ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మూడు డివిజన్లోని (నిజామాబాద్, ఆర్మూర్, బోధన్) అభ్యర్థులు హాజరు కావాలేను. ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో ఉత్తీర్ణతులైన అభ్యర్థులు తమ వెంట రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, మరియు ఆధార్ కార్డు జిరాక్స్, క్యాస్ట్ సర్టిఫికెట్ జిరాక్స్, ఎస్ఎస్సి మెమో జిరాక్స్, ఇంటర్ మెమో జిరాక్స్, డిగ్రీ మెమో జిరాక్స్, తమ వెంట తీసుకొని రాగలరు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ,ఐ.పీ.ఎస్ తెలియజేశారు. ఈ కింద పేర్కొన్నారు= కోడ్ స్కానింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు.

# డాక్టర్ బాసని సురేష్ కు జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారం ప్రదానం



వరంగల్ సెప్టెంబర్ 2 (డీకే.చాటింపు) జానపద సాహిత్య పరిషత్తు అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే పురస్కారాలలో ఒకటైన డాక్టర్ చింతపల్లి వసుంధర రెడ్డి జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బాసని సురేష్ కు ప్రదానం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ కూకట్ పల్లిలోని కృష్ణ సింధూరి సంకల్ప లలిత కళా నిలయంలోని జానపద సాహిత్య పరిషత్తులో డాక్టర్ చింతపల్లి వసుంధరా రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వసుంధర రెడ్డి జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారాన్ని ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఆత్మీయ అతిథి పమిడి కాల్వ మధుసూదన్ చేతుల మీదుగా డాక్టర్ బాసని సురేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా బాసాని సురేష్ ను తెలుగు అకాడమీ డైరెక్టర్ ఆచార్య భట్టు రమేష్, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతచార్యులు పాకనాటి జ్యోతి,జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న, జానపద గిరిజన విజ్ఞాన పీఠం జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ అలీ ఖాన్, అధ్యాపకులు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్ బేరర్ సిద్ధోజు సునంద, సిబ్బంది అభినందనలు తెలియజేశారు

# స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ మాజీ కార్యదర్శి, ఎల్ బి నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 2 (డికె చాటింపు) భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ సోమాజిగూడ సర్కిల్ లో తెలంగాణా ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖా ముఖ్య సలహాదారులు మరియు మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంత రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి మరియు ఎల్ బి నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పాల్గొని స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు... నివాళులు అర్పించిన వారిలో మాజీ మంత్రి వర్యులు ప్రభుత్వ ముఖ్య సలహాదారులు శ్రీ మహ్మద్ షబ్బీర్ ఆలీ , రాజ్యసభ సభ్యులు యం. అనిల్ కుమార్ యాదవ్ , సీనియర్ నాయకులు టి. జగ్గా రెడ్డి , ఫిరోజ్ ఖాన్ , శ్రీ మెట్టు సాయికుమార్ తదితరులున్నారు.



# బెల్లంపల్లి లో బీఆర్ఎస్ మహా ధర్నా... పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య....

బెల్లంపల్లి(డీకే చాటింపు ) గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమలుకాని 6 గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజులలోనే అమలుచేస్తామని నమ్మించి మోసపూరితంగా గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినప్పటికీ నేటివరకూ వాటిని పూర్తిస్థాయిలో అమలుచేయకుండా వంచించినందున బీ ఆర్ ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల వంచక దగా పాలన, 6 గ్యారెంటీలు, 420 హామీల మోసాలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం బెల్లంపల్లి నియోజకవర్గకేంద్రంలోని కాంటా చౌరస్తాలో ధర్నా నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బాకీపడ్డ బాకీకార్డులు ప్రజలకు పంచి, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శించి పార్టీ శ్రేణులతో కలసి నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బాకీ పడిన 6 గ్యారెంటీలు, 420 హామీలు ప్రజలకు చేరేవరకూ ప్రజల



తరపున పార్టీ పక్షాన పోరాటం ఉధృతం చేస్తామని రేవంత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా పాటించాలి

## -ప్రభుత్వ భూముల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి-

## రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 02 (డి కే చాటింపు ) : నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని హితవు పలికారు. నిషేధిత భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని, సమగ్ర వివరాలతో నిర్ణీత ఫార్మాట్ లో నివేదికను రూపొందించి వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో పనిచేసే ఉద్యోగిగా చారి సేవలు ఎనలేనివి

ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 2 (డి కే చాటింపు):ఉద్యోగ జీవితంలో పదవి విరమణ అనేది ఒక భాగమే కానీ జీవితంలో ప్రతి ఒక్కరు నేర్చుకోవడానికి చారి లాంటి ఉద్యోగులను మార్గదర్శకంగా తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని సౌందర్య కొని ఆడారు. ఆర్మూర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ సెక్రటరీ ఏసి డిపిఓ ఎన్ రమణాచారి వీడ్కోలు సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. 40 సంవత్సరాల తన ఉద్యోగ ప్రయాణంలో ఇటు ఉద్యోగులు అటు కుటుంబ సభ్యులు సహకరించడం వల్లనే స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఎలాంటి వడిదుడుకులు లేకుండా పదవి విరమణ చేస్తున్నానని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగంలో బాధ్యతగా మెలిగినప్పుడే మనశ్శాంతి ఆత్మసంతృప్తి ఉంటుందని అన్నారు. పదవి విరమణ సమావేశంలో ఆర్మూర్ సిడిపిఓ భార్గవి వివిధ ప్రాజెక్టు నుండి విచ్చేసిన సి డిపోలు ఎసిడిపివోలు జ్యోతి ,ఇందిరా, విజయలక్ష్మి, నదీమ్ ,శ్రీనివాస్ ,చారి పూజారి, బాల్య మిత్రులు సత్యనారాయణ,అంగన్వాడి సెంటర్ లో టీచర్లు బాల్య స్నేహితులు పాల్గొన్నారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం, సెప్టెంబర్,3, 2026

# దిగజారుతున్న జీవన ప్రమాణాలు..!

యుద్ధాలు, చమురు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పెరుగుతున్న ప్రభుత్వ అప్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు, కొనుగోలు శక్తి తగ్గి జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. దేశవ్యాప్తంగా 2016లో పెద్దనోట్ల రద్దుతో ప్రారంభమైన ఆర్థిక అస్థిరత కరోనా విలయంతో మరింత తీవ్రమైంది. అనంతరం రష్యా?ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, తాజాగా అమెరికా?ఇరాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా మన దేశం చమురు, గ్యాస్ అవసరాల్లో సుమారు 85 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అంతర్జాతీయ పరిణామాల ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడుతోంది. హోర్ముజ్ జలసంధి చుట్టూ నెలకొన్న ఉద్రిక్తతలతో చమురు సరఫరా, రవాణాపై అనిశ్చితి పెరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగే పరిస్థితి ఏర్పడింది. చమురు ధరలు పెరిగితే దాని ప్రభావం కేవలం పెట్రోల్, డీజిల్‌కే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఆహార పదార్థాల ధరలు కూడా పెరుగుతాయి. ఇప్పటికే పెరుగుతున్న ద్రవ్యోల్బ ణంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం ఆహార ద్రవ్యోల్బణం 5.33 శాతానికి చేరిన పరిస్థితుల్లో కూరగాయల ధరలు కూడా అధిక స్థాయిలో కొనసాగుతున్నాయి. ఆదాయాలు పెరగకపోగా ఖర్చులు పెరగడంతో ప్రజల కొనుగోలుశక్తి తగ్గి జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయి. ఇదే సమయంలో దేశంపై పెరుగుతున్న అప్పుల భారం మరో ఆందోళనకర అంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం 2021లో వెల్లడించిన గణాంకాల ప్రకారం అప్పు రూ.138.66 లక్షల కోట్లు ఉండగా, కేవలం ఐదేళ్లలో మరో రూ.62.5 లక్షల కోట్ల అప్పు పెరిగి మొత్తం రూ.201.17 లక్షల కోట్లకు చేరిందని గణాంకాలు పేర్కొంటున్నాయి. అంటే సగటున ప్రతి భారతీయుడి తలపై సుమారు రూ.1.36 లక్షల అప్పు భారం ఉన్నట్లవుతోంది. అభివృద్ధి పేరుతో తీసుకుంటున్న ఈ రుణాల్లో గణనీయమైన భాగం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తుండటంతో ప్రభుత్వ ఖజానాపై భారం పెరుగుతోంది. రుణాలు తీసుకుని సంపద, ఉద్యోగాలు, ఉత్పాదక రంగాలు పెరగాల్సిన చోట అవి ప్రజల జీవితాలను మెరుగుపరచకపోతే భవిష్యత్ తరాలపై మరింత రుణభారం పడే ప్రమాదం ఉంది. దేశ ఆర్థికాభివృద్ధి గణాంకాలు ఒకవైపు ఆశాజనకంగా చూపుతున్నప్పటికీ, సామాన్యుల వాస్తవ పరిస్థితులు మరో విధంగా ఉన్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గడం, ఖాళీ ప్రభుత్వ పోస్టులు భర్తీ కాకపోవడం, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పెరగడం యువతలో ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తా మన్న హామీలకు అనుగుణంగా అవకాశాలు లభించకపో వడంతో యువత నిరాశకు గురవుతోంది. ఉద్యోగాల కోసం పోరాడుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వారిపై కఠిన చర్యలకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చనీయాంశంగా మారుతోంది. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వ్యవసాయ రంగంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. నీటి నిల్వలు తగ్గిపోవడం, సాగునీరు, తాగునీటి సమస్యలు, వర్షాలపై ఆధారపడిన రైతుల్లో ఆందోళన పెరగడం భవిష్యత్ ఆహార భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముడి చమురు ధరల పెరుగుదల, ట్రంప్ సుంకాలు, కార్పొరేటీకరణ ప్రభావంతో అసంఘటిత కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఐ& పీఆర్ అదనపు సంచాలకులు డిఎస్ జగన్



హైదరాబాద్,సెప్టెంబర్ 2 (డీకే చాటింపు) సమాచార, పౌర సంబంధాల శాఖలో డిఎస్ జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జగన్ రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్,సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి డిఎస్ కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలిపారు. శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు,అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





మంచిర్యాల్ (డీకే చాటింపు) సెప్టెంబర్ 2: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. చిత్తాపూర్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న వి.ఓ. భవన నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించి, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధనా ప్రణాళికలు రూపొందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ, ఫారాల స్వీకరణ, వివరాల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో పంట కుంట నిర్మాణ పనులను పరిశీలించి, గ్రామస్థులతో మాట్లాడి పంట కుంట వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్షపు నీటిని సంరక్షించుకోవడంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత పెంచుకునేందుకు సమన్వయంతో కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నెన్నెల మండల సమాఖ్య ఆధ్వర్యంలోని యూనిఫాం కుట్టు కేంద్రాలను సందర్శించి యూనిఫాం కుట్టు పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని, విద్యుత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీర్‌ను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల హాజరు, ఎఫ్.ఆర్.ఎస్. హాజరు నమోదు, ఆపార్ ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థుల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఏపీవో, ఏపీఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 22-ఏ నిషేధిత భూముల జాబితాల

# రూపకల్పనలో అత్యంత జాగ్రత్త వహించాలి

## దేవాదాయ శాఖ భూములపై ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాలి:అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత



జగిత్యాల, సెప్టెంబర్2,(డీకే చాటింపు) జిల్లాలోని దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను 22-ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చే ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాల తయారీ, పరిశీలన మరియు తుది ఖరారుపై జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి సుప్రియ మరియు ఆ శాఖ సిబ్బందితో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూ..దేవాలయాలు మరియు ఇతర దేవాదాయ సంస్థలకు చెందిన భూముల సర్వే నంబర్లు, ఉప విభాగ సంఖ్యలు, విస్తీర్ణం, భూమి వర్గీకరణ, యాజమాన్య వివరాలు, రెవెన్యూ మరియు దేవాదాయ శాఖ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే 22-ఏ జాబితాలను తుది ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, సంబంధిత రికార్డులను పరస్పరం సరిచూసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ భూములు పొరపాటున జాబితా నుంచి మినహాయించబడకుండా, అలాగే తప్పుడు సర్వే నంబర్లు లేదా విస్తీర్ణాలు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ మరియు దేవాదాయ శాఖ ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎలాంటి లోపాలు, అనధికార మార్పులు లేదా మినహాయింపులు చోటుచేసుకోకుండా ప్రతి ప్రతిపాదనను బాధ్యతాయుతంగా పరిశీలించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, దేవాదాయ శాఖ రిజిస్టర్లు మరియు ఇతర ఆధారాలను సమగ్రంగా ధృవీకరించిన అనంతరమే జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు.దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, సంబంధిత భూముల విషయంలో ప్రభుత్వ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించిన, దోషరహితమైన తుది 22-ఏ నిషేధిత భూముల జాబితాలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి సుప్రియ, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బందిహౌహౌసంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు



ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 2 (డీకే చాటింపు)అర్మూర్ డివిజన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యన్ని నందిపేట ఎస్ ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వానియా చామాచారం మేరకు రైతు పారం గ్రామ శివారులో పోలీసులు వాహనాల్ని తనికి చేపట్టారు బోలోరో వాహనం లో అక్రమంగా తరలిస్తున్న బియ్యన్ని స్వాధీనం చేసుకున్నారు ఈ ఘటన పై నలుగురిపై కేసు నమోదు చేసి రేషన్ బియ్యం తో పాటు తరలింపునకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ప్రభుత్వ రేషన్ బియ్యన్ని అక్రమంగా కొనుగోలు చేయాడం నిల్వ ఉంచడం విక్రయంచడం చట్టరీత్యానేరామని అధికారులు పేర్కొన్నారు

# అంబులెన్స్‌లను తనిఖీ చేసిన డీవైసీఎంవో డాక్టర్ మధుకుమార్



క్యాతనపల్లి (డీకే చాటింపు):రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని అంబులెన్స్‌ల పనితీరు, అత్యవసర వైద్య సేవల సన్నద్ధతను డీవైసీఎంవో డాక్టర్ మధుకుమార్ విధులలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ.,. వాహనాల్లోని ఆక్సిజన్ సిలిండర్లు, ఫ్లో మీటర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, స్ట్రెచర్లు, ప్రాణరక్షక మందుల లభ్యతను స్వయంగా పరిశీలించడంతో పాటు వాహనాల ఫిట్‌నెస్, బ్యాటరీ కండిషన్, సైరన్ తదితర సాంకేతిక వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో గని కార్మికులు, వారి కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్యం అందించేలా అంబులెన్స్ విభాగం 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, ఎమర్జెన్సీ కాల్ వచ్చిన వెంటనే వేగంగా స్పందించాలని డ్రైవర్లు, సిబ్బందిని ఆదేశించారు. లాగ్‌బుక్ వివరాలను ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేయాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, పారామెడికల్ అధికారులు పాల్గొన్నారు.

# ఎల్లుండి శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ




ఎల్బీనగర్, సెప్టెంబర్ 2, డీకే చాటింపు:-తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎల్లుండి శుక్రవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోపూజ కార్యక్రమాన్ని హస్తినాపురం అగ్రికల్చర్ కాలని శ్రీరామాలయంలో నిర్వహించబడును. అందుకు సంబంధించిన బ్యానర్ ను అగ్రికల్చర్ కాలని శ్రీరామాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గూడూరు హరినాథ్, అగ్రికల్చర్ కాలని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుచ్చిరెడ్డి, టిటిడి హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు టి సురేందర్ కాలనీ వాసులు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిటిడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ గూడూరు హరినాథ్ మాట్లాడుతూ ఎంపిక చేసిన కేంద్రాలలో గోపూజా కార్యక్రమం గోకులాష్టమి సందర్భంగా నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేశారు. అదేవిధంగా కాలని ప్రెసిడెంట్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా టీటీడీ హిందూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అత్యంత శ్రద్ధా భక్తులతో గోపూజా కార్యక్రమం గోకులాష్టమి ఉట్ల పండుగ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రలు కావలెనని తెలియజేశారు.

# కొడవటూరులో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ




జనగామ/బచ్చన్నపేట సెప్టెంబర్ 2డీకే చాటింపు జిల్లా ప్రతినిధి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ బాకీ కార్డును ప్రతి ఇంటి ఇంటికీ పంపిణీ చేసారు. బుధవారం ఈ సందర్భంగా స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు,హామీల అమలు కోసం ప్రజల తరపున నిరంతరం పోరాటం కొనసాగుతుందన్నారు.

# బెల్లంపల్లి 2టౌన్ పోలీసుల తనిఖీలు...

బెల్లంపల్లి(డీకే చాటింపు ) పట్టణం లో 2 టౌన్ పరిధిలో కాల్టెక్స్,రైల్వే స్టేషన్ ఏరియా లలో మాదకద్రవ్యాల రవాణా మరియు వినియోగ నిరోధక కార్యక్రమంలో భాగంగా, బెల్లంపల్లి 2 టౌన్ ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో మరియు సిబ్బంది నార్కోటిక్ డాగ్ టీమ్ తో కలిసి రైల్వే స్టేషన్, బస్ స్టాప్, దుకాణాలు, హోటళ్లు, పాన్ షాపులు , సినిమా థియేటర్లు సోదాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.



# ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తే..

## 2034 వరకు సీఎంగా ఉంచే బాధ్యత ఉద్యోగ, ఉపాధ్యాయులదే..!

### -ప్రభుత్వం కాలయాపన చేయకుండా సమస్యలను పరిష్కరించాలి... -విద్యాశాఖలో రోజుకో కొత్త ప్రయోగం వద్దు... -పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి... - నారాయణపేట జిల్లా కేంద్రంలో పిఆర్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్ తదితర పాఠశాలల్లో బుధవారం పిఆర్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల ఉద్దేశించి పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరైన సమయంలో స్పందించకుండా వారు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఇటీవల భారీ స్థాయిలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్ల తెలిపారు. ఈ ధర్నా తర్వాత ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే వారి మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పిఆర్సి, సిపిఎస్ రద్దు,పెండింగ్ డీఏలు,317 జీవో పరిష్కారం,2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ,ఉపాధ్యాయుల ద్వారా డబ్బులు తీసుకొని నాలుగు నెలలుగా హెల్త్ కార్డులు సరిగ్గా అమలు చేయకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. వీటన్నిటిని 15 రోజుల్లో పరిష్కారం చేయకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి రుచి చూపించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. పై సమస్యలు పరిష్కరిస్తే సీఎం అనుకున్న విధంగా 2034 వరకు ఆయనను సీఎంగా ఉంచే బాధ్యత ఉద్యోగ, ఉపాధ్యాయులు తీసుకుంటారన్నారు. విద్యాశాఖలో రోజుకో కొత్త ప్రయోగం చేయకుండా ఉపాధ్యాయులను బోధన చేయడానికి పరిమితం చేయాలని సూచించారు అదేవిధంగా ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్ష పేపర్లను మండల వనరుల కేంద్రంలో మూల్యాంకనం చేయడాన్ని పునరాలోచించాలని సూచించారు. మండల వనరుల కేంద్రంలో మూల్యాంకనం చేయడం వలన ఉపాధ్యాయులు పాఠశాలకు దూరం కావాల్సి ఉంటుందని,అది బోధనపై ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మండల అధ్యక్షులు రఘువీర్, నారాయణపేట పట్టణ అధ్యక్షులు వాణిశ్రీ,ప్రధాన కార్యదర్శి జైరుద్దీన్,రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నయీమ్,పాఠశాల




ఉపాధ్యాయ బృందం దత్తు రావు,గిరిజమ్మ,శాంత,దేవిక రాణి,ఆంజనేయులు, మొనప్ప,ప్రదీప్ పాల్గొన్నారు.

**ఏటిఓను సత్కరించిన పిఆర్టియు**

నారాయణపేటలో ఎస్టిఓగా విధులు నిర్వహిస్తున్న వి. రాజగోపాల చారి ఏటిఓగా పదోన్నతి పొంది నారాయణపేట జిల్లా ఏటిఓ గా,ఇన్చార్జి డిటిఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఆర్టియు ఆధ్వర్యంలో ఆయనకు మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. పిఆర్టియు జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో డిటిఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను ఏ విధంగా పరిష్కరించారో అలాగే జిల్లాలో అందరం కలిసి పని చేద్దామని కోరగా అందుకు జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఒ హరికృష్ణ,సీనియర్ అకౌంటెంట్ సంతోష్, నారాయణపేట పిఆర్టియు మండల అధ్యక్షులు రఘువీర్,ఉట్కూరు మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి,నాయకులు గోపాలకృష్ణ ,దత్తు రావు, అబ్దుల్ సలాం,వెంకటప్ప, జైరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కా వ్యూహాలతో టీపీసీసీ

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ముందస్తు వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు వేడెక్కుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పన్నుతున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం సాగుతున్న పోరులో బీజేపీ అవలంబిస్తున్న తీరును గమనించిన కాంగ్రెస్ నాయకత్వం, దాన్ని క్షేత్రస్థాయిలోనే ఎదుర్కొనేందుకు సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగానే, న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటైన సుమారు నాలుగు నెలల తర్వాత మొదటిసారి జరిగిన ఈ భేటీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వంశీచంద్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఈ ఓట్ల తొలగింపు కుట్రను ఏకగ్రీవంగా తిప్పికొట్టాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సవరణ ప్రక్రియ రాష్ట్రంలో 50 నుండి 60 శాతం మేర పూర్తయిందని, రాబోయే రెండు మూడు రోజుల్లో మొదటి దశ పూర్తిగా ముగియనుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న 36 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.సాఐఖీ ప్రక్రియ ముగిసే వరకు పార్టీ ముఖ్య నేతలు, డిసిసిలు, మండల స్థాయి నాయకులు ఎలాంటి ఇతర



పనులూ పెట్టుకోకుండా పూర్తిస్థాయిలో దీనిపైనే దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో మందకొడిగా వ్యవహరించిన కొందరు పార్టీ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, బీఎల్ఏల తీరుపై సమావేశంలో మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నిర్లక్ష్యం వహించే వారిపై రివ్యూ జరిపి, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం కాంగ్రెస్ కఠిన వైఖరికి నిదర్శనం. పార్టీ యంత్రాంగం-ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం సాధించడం కోసం ప్రతి రెండు నెలలకోసారి పీసీసీ సమన్వయ కమిటీ భేటీ కావాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి -మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జిల్లాల ఇన్చార్జిలు, జిల్లా పీసీసీలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదికల ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

మొత్తానికి, ఓటర్ల జాబితా పరిరక్షణ నుండి ఎన్నికల వ్యూహాల వరకు కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నాయని స్పష్టమవుతోంది.

# బోయిన్ పల్లి తండాలోవీబీ జీ-రామ్ జీ గ్రామసభ

### -ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి... -గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్... - నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపుదల,వర్షపు నీటిని సద్వినియోగంపై చర్చ...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం బోయిన్ పల్లి తాండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్(గ్రామీణ)' (వీబీ జీ-రామ్ జీ)గ్రామసభ ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన జరిగింది . ఈ గ్రామసభలో "ఇంటింటికి ఇంకుడు గుంత-ప్రతి పొలానికి పంట గుంట-ఊరుకు ఊట కుంట"అనే లక్ష్యంతో గ్రామంలో నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపుదల,వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేలా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో నీటి వనరులను సంరక్షించి, బోయిన్ పల్లి తండాను జలసంరక్షణలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరించి కొత్తగా'వీబీ జీ రామ్ జీ'ని తీసుకొచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు,ఉప సర్పంచ్ రమేష్ నాయక్,ఈసీ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, వార్డు సభ్యులు దేవమ్మ, పిత్య నాయక్,కృష్ణ నాయక్, మాజీ వార్డు సభ్యులు



వెంకటేష్ నాయక్,తూల్యా నాయక్,గోపాల్ నాయక్, సీత్యా నాయక్,గోపాల్ నాయక్,హేమ్ల నాయక్,రవి నాయక్,మొత్య నాయక్, చందర్ నాయక్,సొమ్ల నాయక్,రమేష్ నాయక్, బాధ్యమ్మ,బుగమ్మ,సీతమ్మ, భామనమ్మ,దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

## టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు



హైదరాబాద్, : తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చాంద్రాయణపల్లి అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన వారిపై కేసు నమోదు

ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 2 (డికె చాటింపు):ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చాంద్రాయణపల్లి బీట్ పరిధిలో పర్మిషన్ లేకుండా చెట్లు నరికి వేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ బట్, సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్, బీట్ ఆఫీసర్ వందన తెలిపారు. అటవీ సంరక్షణలో ఉన్న

చెట్లున్నరికి వేయడం నేరమని కంపార్ట్మెంట్ నెంబర్ 471లో మూడు బండ్ల నిండుగా చెట్లు నరికి తీసుకెళ్తుండగా పట్టుకుందామని, ఎత్తుతాండ కు చెందిన భగవత్ వాల్య కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు చట్టం 1967 ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనధికారికంగా చెట్లు నరికితే కేసులు నమోదు చేస్తామని చుట్టుపక్కల గ్రామాల వారికి హెచ్చరించారు.


# ఏటీవోగా పదోన్నతి పొందిన రాజగోపాల చారి




నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా ఎస్టిఓ గా పనిచేస్తున్న రాజగోపాల చారి ఏటీవోగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బుధవారం కార్యాలయపు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ రాజగోపాలచారికి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఏటీవోగా పదోన్నతి పొందిన రాజగోపాలాచారి మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదోన్నతి అవకాశాన్ని సద్వినియోగం చేసి న్యాయం చేస్తానని తెలిపారు.

# లోకల్ ఎన్నికలపై విజయ్ బ్యాక్ స్టెప్

చెన్నై, : తమిళనాడు రాజకీయ వేదికపై విప్లవాత్మక మార్పులతో అధికారాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్, ప్రతిపక్షాలకు చిక్కని కొత్త వ్యూహానికి తెరలేపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరలోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారంలోకి వచ్చాయి. పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇప్పుడే ఎన్నికలకు వెళ్తే పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే అంచనాలతో ఎన్నికలను కనీసం ఒక ఏడాది పాటు వాయిదా వేయాలని సీఎం విజయ్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యూహాత్మక వెనుకంజ వెనుక ఉన్న అసలు కారణం.. టీవీకేకి క్షేత్రస్థాయిలో ఉన్న బలహీనమైన సంస్థాగత నిర్మాణమే . అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్టార్ పవర్, యువత ఓట్లు , కొత్త మార్పును కోరుకున్న ఓటర్ల మద్దతుతో టీవీకే ఘనవిజయం సాధించినప్పటికీ, గ్రామ స్థాయిలో క్రియాశీలక నాయకత్వం, బూత్ స్థాయి నెట్‌వర్క్ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం అధినేత ఇమేజ్, రాష్ట్రస్థాయి అంశాలు సరిపోతాయి కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా క్షేత్రస్థాయి వ్యక్తిగత పరిచయాలు, బలమైన కార్యకర్తల జాలంపైనే ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో స్థానిక పోరుకు వెళ్తే గ్రామీణ స్థాయిలో ఉన్న క్యాడర్ లోపం బయటపడే అవకాశం ఉంది. మరోవైపు, పరాజయం పాలైనప్పటికీ ఇప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గ్రామీణ స్థాయిలో బలమైన స్థానిక బూత్ కమిటీలు కలిగిన ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే, తమకున్న కేడర్ బలంతో డీఎంకే క్షేత్రస్థాయిలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ ప్రతిపక్ష డీఎంకే గనుక స్థానిక పోరులో పైచేయి



సాధిస్తే, టీవీకే గెలుపు కేవలం తాత్కాలిక వేవ్ లేదా హైప్ మాత్రమే.. క్షేత్రస్థాయిలో వాళ్లకు ఎలాంటి పునాది లేదు అని విస్తృతంగా ప్రచారం చేసి విజయ్ ప్రభుత్వ ఇమేజ్‌ను మొదటికే మోసం చేసేలా కౌంటర్ ఇచ్చే ప్రమాదం ఉందని అధికార పక్షం భావిస్తోంది. ఈ ముప్పును ముందుగానే గ్రహించిన సీఎం విజయ్, ముందుగా రాబోయే అసెంబ్లీ ఉపఎన్నికలపై దృష్టి సారించి, స్థానిక సంస్థల పోరును ఏడాది పాటు పక్కన పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం.

ఈ లోపు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డులో టీవీకే కమిటీలను పటిష్టం చేసి, కొత్త రక్తాన్ని నింపి, శ్రేణులకు దిశానిర్దేశం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిల్లో డీఎంకేను ఢీకొట్టేలా వ్యవస్థను నిర్మించుకున్న తర్వాతే బరిలోకి దిగడం సురక్షితమని, ఆలోపు ప్రభుత్వం

ఇచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల్లో మరింత ఆదరణ పెంచుకోవాలని టీవీకే నాయకత్వం భావిస్తోంది. ఎన్నికలను వాయిదా వేసే యోచన వెనుక భయం కంటే రాజకీయ చాతుర్యమే ఎక్కువగా కనిపిస్తోందని అంటున్నారు. ప్రత్యర్థుల బలమైన ప్రాంతంలో తొందరపడి అడుగుపెట్టి దెబ్బతినడం కంటే, సమయం తీసుకుని సొంత సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాకే యుద్ధానికి వెళ్లడం విజయ్ రాజకీయ పరిణతికి నిదర్శనంగా మారింది.

# కేటీఆర్ హస్తిన పర్యటనల వెనుక...?

హైదరాబాద్, : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరసగా ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇటీవల హస్తిన బాట పట్టడం ఒకింత రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది. అధికార పక్షంలో ఉన్న వారు సహజంగా హస్తినకు వెళ్లి కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి చర్చించడం ఎక్కడైనా జరుగుతుంది. కానీ తెలంగాణలో మాత్రం కేటీఆర్ ఇటీవల కాలంలో వరసగా ఢిల్లీకి వెళుతూ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం హాట్ టాపిక్ గా మారింది. ఒక రకంగా రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఇదొక రకమైన సవాల్ విసురుతున్నట్లే అనుకోవాల్సి ఉంటుంది... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. కొన్నిరోజుల క్రితం కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి ఆదిలాబాద్ లో సీసీఐ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వతేదీన కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. రెండు వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం కూడా చర్చనీయాంశంగా మారింది.



తాజాగా మరోసారి ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కేటీఆర్ కలిశారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, ఐటీ విస్తరణ మరియు జాతీయ రాజకీయ వ్యూహాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. ఆర్ ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి సిరిసిల్ల రైల్వే ప్రాజెక్టుతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే పనులపై చర్చించారు. రాష్ట్రంలో కొత్త ఐటీ సంస్థల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన గురించి కేంద్ర పెద్దలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం, జాతీయ స్థాయిలో పార్టీ ఉనికిని చాటడం ఈ పర్యటనల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. మొత్తం మీద కేటీఆర్ హస్తిన టూర్లు ఇటు అధికార పార్టీలో కాక రేపుతున్నాయి. కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం సరికొత్త రాజకీయ ఎత్తుగడగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా

**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ- గుంటూరు-అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల





కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది.మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ-గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

# ఇన్ స్టాలో ప్రేమ , పరిచయం

హైదరాబాద్, : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల కేసులో శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన ఫిర్యాదు మేరకు అరెస్టయిన అతడిని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో నిందితుడిని చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ(ఎస్‌వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల మహిళా అధికారిణి జూలై 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి తనపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, అసభ్యకర సందేశాలు పంపాడని, కత్తితో బెదిరించి, గొంతు నులిమి హత్య చేసేందుకు ప్రయత్నించాడని ఆమె ఆరోపించారు. తన ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి భర్తకు పంపాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య నాయక్ నేతృత్వంలోని ప్రత్యేక బృందానికి అప్పగించారు. బాధితురాలికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆమె మెడ, బుగ్గలపై గాయాలున్నట్లు నిర్ధారణ అయింది.నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించినట్లు సజ్జనార్ వెల్లడించారు. యూపీఎస్సీలో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన అతను, 2025 డిసెంబర్ నుంచి శిక్షణ పొందుతున్నాడని తెలిపారు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధితురాలితో నిందితుడికి పరిచయం ఏర్పడినట్లు వివరించారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ కు ఎంపికైన తన విజయప్రస్థానంపై ఉదయ్ కృష్ణారెడ్డి పెట్టిన పోస్టుకు బాధితురాలు స్పందించడంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో, తాను 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని, ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉన్నందున 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణ తీసుకోనున్నట్లు బాధితురాలు నిందితుడికి తెలియజేసినట్లు వెల్లడించారు. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారి, తదనంతరం ప్రేమకు దారితీసిందని సజ్జనార్ పేర్కొన్నారు.శిక్షణ సమయంలో వీరి మధ్య బంధం బలపడినప్పటికీ, కొంతకాలానికి ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయని తెలిపారు. నిందితుడి పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడమే కాకుండా, బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరికొట్టి ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. బాధితురాలు తనను బ్లాక్ చేయడంతో, నిందితుడు నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి వ్యక్తిగత చాట్ వివరాలను బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని సజ్జనార్ తెలిపారు. వేధింపులు భరించలేక బాధితురాలు అతడికి దూరంగా జరిగి మరొకరిని వివాహం చేసుకున్నప్పటికీ, నిందితుడి వేధింపులు కొనసాగడంతో చివరకు ఆమె పోలీసులను ఆశ్రయించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


# ఏళ్లలో 30 మండలి ఖాళీలు



**గుంటూరు,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం శాసనమండలి నామినేటెడ్ స్థానాల చుట్టూ తిరుగుతోంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో దాదాపు ఇరవై మందికి పైగా సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడుతుండటం అమరావతి వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ప్రస్తుతం ఖాళీ అయిన రెండు స్థానాల కోసమే క్యూలో నిలబడి అసంతృప్తికి లోనుకావాల్సిన అవసరం లేదని, కాస్త ఓపిక పడితే ఆశావహులందరికీ పదవులు దక్కడం ఖాయమని సమగ్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని 164 స్థానాల బలం ఆధారంగా రాబోయే మూడేళ్లలో మండలి మాత్రమే కాకుండా పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభ సీట్లు కూడా ఏకపక్షంగా కూటమి ఖాతాలోనే పడనున్నాయి.ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోని మొత్తం 58 స్థానాలు ఉన్నాయి. 2026 నుంచి మార్చి 2029 నాటికి సుమారు 30కి పైగా సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇందులో ఎమ్మెల్యే కోటా, స్థానిక సంస్థల కోటా, గవర్నర్ నామినేటెడ్, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఖాతాలో పడిన స్థానాలన్నీ వరుసగా ఖాళీ అవుతూ వస్తున్నాయి. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కనీస బలం కూడా లేకపోవడంతో, త్వరలో ఖాళీ కాబోయే ప్రతి ఒక్క సీటూ పోటీయే లేకుండా ఏకగ్రీవంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. ముఖ్యంగా 2026 నుంచి 2027 చివరి నాటికి గవర్నర్ నామినేటెడ్ కోటాలో 6 సీట్లు, ఎమ్మెల్యే కోటాలో దాదాపు 7 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు స్థానిక సంస్థల కోటాలో కూడా 10 స్థానాల గడువు ముగియనుంది. అప్పటికి స్థానిక ఎన్నికలు అయిపోతాయి. సహజంగానే అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సంపూర్ణ ఆధిక్యంతో ఎమ్మెల్యే కోటాలోని స్థానాలన్నీ కూటమికే దక్కుతాయి. మెజారిటీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూటమి వైపు మొగ్గు చూపడం లేదా ఖాళీలు ఏర్పడటంతో ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల విజయం సునాయాసంగా మారనుంది. 2029 మార్చి నాటికి ఎమ్మెల్యే కోటాలో మరో 7 స్థానాలు ఖాళీ కానుండటంతో పాటు, పట్టభద్రుల. ఉపాధ్యాయుల స్థానాల గడువు కూడా పూర్తికానుంది. పట్టభద్రుల స్థానాల్లో ఇప్పటికే కూటమికి విపరీతమైన ఆమోదయోగ్యత ఉందని గత ఫలితాలు నిరూపించాయి. దీనివల్ల నాటి ఎన్నికల నాటికి శాసనమండలిలో వైఎస్ఆర్‌సీపీ ప్రాతినిధ్యం దాదాపు శూన్యానికి చేరుకుని, మండలిలో ఎన్డీయే కూటమికి తిరుగులేని సంపూర్ణ మెజార్టీ లభిస్తుంది. కేవలం శాసనమండలి మాత్రమే కాదు, ఢిల్లీలోని రాజ్యసభ సీట్ల సమీకరణలు కూడా కూటమికి అత్యంత సానుకూలంగా మారాయి. ఎంపీల పదవీకాల ముగింపు క్రమంలో 2028లో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలు నూరు శాతం కూటమి ఖాతాలోనే పడనున్నాయి. కేంద్రంలోనూ ఎన్డీయే భాగస్వామిగా ఉన్న టీడీపీ-జనసేనలకు ఈ రాజ్యసభ స్థానాలు దక్కడం వల్ల జాతీయ రాజకీయాల్లోనూ కూటమి నేతల ప్రాధాన్యత, ప్రాతినిధ్యం మరింత పెరగనుంది. ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషిస్తే, ప్రస్తుతం గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం టీడీపీ అగ్రనేతలపై ఒత్తిడి తేవడం లేదా నిరాశకు గురికావడం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో దాదాపు 30కి పైగా ఎమ్మెల్సీ స్థానాలు, 4 రాజ్యసభ స్థానాలు అందుబాటులోకి రానున్నందున.. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, సామాజిక సమీకరణల్లో వెనుకబడిన నాయకులు, ఎన్నికల్లో త్యాగాలు చేసిన అభ్యర్థులకు విడతల వారీగా పదవులు అప్పగించేందుకు చంద్రబాబు వద్ద స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉందని చెబుతున్నారు. పార్టీ శ్రేణులు ఓపిక పడితే ప్రతి అర్హులైన నాయకుడికీ తగిన గుర్తింపు లభించడం ఖాయమని అంటున్నారు.

# కూటమికి టిక్కెట్ల సవాల్

**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు.మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేకరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా,



ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.

15 తర్వాత మున్సిపల్ ఎన్నికలు

ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి.ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డో కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. స్థానిక సమరానికి ముందే పార్టీ నేతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పదవులు దక్కిన నేతలు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

# భారతికి కీలక బాధ్యతలు

**కడప,** : వైసీపీలో అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వమే ప్రధాన బలంగా నిలిచింది. పార్టీ విజయాలు, పరాజయాలు, రాజకీయ నిర్ణయాలు అన్నీ కూడా జగన్ చుట్టూనే తిరిగాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ నిర్వహణలో మరో కీలక నాయకత్వం అవసరమనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.గతంలో విజయసాయిరెడ్డి పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని భావించేవారు. ఆయన పార్టీకి దూరమైన తర్వాత ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి సమన్వయం చేస్తున్నారని ప్రచారం ఉన్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఇంకా మార్పులు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు కోటరీ రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.ఈ పరిస్థితుల్లో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ కొత్త వ్యూహం సిద్ధం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఆయన ప్రజల మధ్య ఎక్కువ సమయం గడపాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలను చూసుకునే నమ్మకమైన నాయకత్వం అవసరమని ఆయన భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. జగన్ సతీమణి వైఎస్ భారతి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యురాలు కావడం, సంస్థాగత వ్యవహారాలపై అవగాహన ఉండడం, నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉండడం వంటి కారణాలతో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇతర నేతలకు అలాంటి బాధ్యతలు ఇస్తే అంతర్గత విభేదాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుండగా, భారతి అయితే అందరినీ సమన్వయం చేయగలరని కూడా అంటున్నారు.ఇప్పటి వరకు భారతి ప్రత్యక్ష



రాజకీయాల్లో పెద్దగా చురుకుగా కనిపించలేదు. అయితే ఎన్నికల సమయంలో పులివెందుల ప్రాంతంలో జగన్ తరఫున ప్రచారం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అలాగే వ్యాపార, సంస్థాగత అంశాల నిర్వహణలో ఆమెకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అనుభవం పార్టీ నిర్వహణలో కూడా ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు.రానున్న సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి భారతిని పోటీ చేయించే అవకాశాన్ని జగన్ పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే వరుస విజయాలు నమోదు చేశారు. అయితే భవిష్యత్తులో భారతిని బరిలోకి దింపితే ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కూడా పార్టీకి మరింత బలం చేకూరుతుందనే అంచనాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవన్నీ ఇప్పటికైతే అధికారికంగా ధృవీకరించబడిన విషయాలు కావు. పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అందువల్ల భారతి పార్టీ కీలక బాధ్యతలు చేపడతారా, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది రాబోయే రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ ప్రచారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# సొంత పార్టీలో తమ్ముడి సౌండ్

**విజయనగరం,** : తెలుగుదేశం పార్టీ అంటే క్రమశిక్షణ అన్నది ప్రధానంగా అంతా మాట్లాడుకుంటారు. వర్గ పోరు కానీ సొంత పార్టీలో సౌండ్ చేయడం లాంటి చర్యలను కానీ పెద్దగా ఉపేక్షించేది ఉండదు. అయితే అన్నీ తెలిసిన సీనియర్ తమ్ముడు ఒకరు ఇటీవల కాలంలో చేస్తున్న హడావుడి పార్టీలో పెద్ద ఎత్తున చర్చగా సాగుతోంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన కర్రోతు బంగారు రాజు బలమైన సామాజిక వర్గానికి చెందిన నేత. పలుకుబడి దండీగా ఉంది. మండల పరిషత్ అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ గా కొనసాగుతున్నారు. ఆయనకు ఎమ్మెల్యే సీటు దక్కాల్సి ఉంది. 2024 లో కూటమి పార్టీలతో పొత్తు వల్ల అనేక సమీకరణల నేపథ్యంలో చాన్స్ జనసేనకు వెళ్ళింది. ఆనాడు ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని అధినాయకత్వం ప్రామిస్ చేసింది అని అంటారు. కానీ చివరికి దక్కింది నామినేటెడ్ పదవి అన్న బాధ అయితే ఉందిట. ఇక బంగార్రాజు గురించి ఎందుకు ఇపుడు అంతగా చర్చ అంటే తాజాగా భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తి అయిన సందర్భంగా ఒక్కసారి అక్కడికి వెళ్ళి ఫైనల్ గా సమీక్షను చేశారు కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు. ఈ సందర్భంగా ఆయన నిర్వహించిన సమావేశంలో ప్రోటోకాల్ ప్రకారం బంగార్రాజుకు పాల్గొనే అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు ఉద్యోగాల సంగతేంటి అని కేంద్ర మంత్రినే నిలదీశారు. మీరు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతారు కానీ మేము జనాలకు జవాబు చెప్పుకోవాలి అంటూ బంగార్రాజు మాట్లాడిన తీరు అక్కడ ఉన్న వారిని సైతం ఆశ్చర్యానికి గురి చేసింది అంటున్నారు. సొంత పార్టీకి చెందిన కేంద్ర మంత్రిని అదే పార్టీకి చెందిన స్థానిక నేత ఈ విధంగా నిలదీయడం అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు. ఇక విజానగరం జిల్లాలో జరిగే డీఆర్సీ సమావేశంలో కూడా ఈ విధంగానే బంగార్రాజు గొంతు పెంచి ప్రజా సమస్యల పేరుతో అధికారులను గట్టిగానే నిలదీయడం చేస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు నెల్లిమర్ల పంచాయతీ సమావేశంలో కూడా తన అధికార హవాను ఆయన గట్టిగానే చూపించారు అని అంటున్నారు. దీంతో పాటు ఆయన నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవితో సమాంతరంగా అధికార దర్పం చాటుకుంటున్నారు అని ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ అన్నట్లుగా ఉంటుంది. దాంతో ఇక్కడ కూటమిలో వర్గ పోరు సాగుతోంది అని అంటున్నారు. బంగార్రాజుకు జనంలో పలుకుబడి ఉంది. ఆయన స్థానికంగా గట్టి నాయకుడే. స్థానికుల డిమాండ్లను అధికారుల మంత్రుల ముందు పెట్టి చేయించుకుంటారు అని అంటున్నారు. కానీ సొంత పార్టీ నేతలను కేంద్ర రాష్ట్ర మంత్రులను ఇరకాటంలో పెట్టే విధంగా ఆయన వ్యవహరిస్తున్న తీరు మాత్రం చర్చనీయాంశం అవుతోంది. తాను ఎమ్మెల్యే స్థాయి నేతను అని చాటుకునేందుకు తన ఇమేజ్ ని పెంచుకునేందుకు ఇలా చేస్తున్నారు అని సొంత పార్టీలో గుసగుసలు పోతున్నారు. తనకు ఇలాగైతేనే మంచి గుర్తింపు లభిస్తుందని తన హవా ఎంటో పెద్దలకు తెలుస్తుందని ఆయన భావిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఈ విధంగా అతి చేస్తే రేపటి రోజున ఇబ్బందులు కూడా వస్తాయని అంటున్నారు. పార్టీ అన్నింటి కన్నా క్రమశిక్షణకే పెద్ద పీట వేస్తుందని కూడా గుర్తు చేస్తున్నారు పార్టీ నేతలు.

# హెచ్ఎండీఏ సరికొత్త మాస్టర్ ప్లాన్.. చిరు వ్యాపారుల కోసం వెండర్ జోన్లు

**హైదరాబాద్,** : హైదరాబాద్ నగరంలో చౌరస్తాలు, రోడ్ల పక్కన ఉన్న చిన్న చిన్న ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కాపాడేందుకు, వాటి ద్వారా ఆదాయం పొందేందుకు హెచ్ఎండీఏలోని హుమ్టా సరికొత్త ప్రణాళిక రూపొందించింది. అక్రమ ఆక్రమణలను అరికట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ స్థలాల్లో వెండర్ జోన్లు ఏర్పాటు చేసి షాపులు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశలో అమీర్ పేట జంక్షన్, సత్యం థియేటర్ ఎదురుగా ఉన్న స్థలాల్లో ఈ వెండర్ జోన్లను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ షాపులను నిర్మించి చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి శాశ్వత ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఆక్రమణల బారిన పడుతున్న చిన్నచిన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంతో పాటు వాటి ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చే దిశగా హెచ్ఎండీఏ పరిధిలోని హుమ్టా కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని ప్రధాన చౌరస్తాలు, రోడ్ల సమీపంలో నిరుపయోగంగా ఉన్న చిన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి, వాటిని ఆధునిక వెండర్ జోన్ల రూపంలో అభివృద్ధి చేయాలని భావిస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధుల్లోని పలు ప్రాంతాలలో ఈ సరికొత్త ప్రణాళికను అమలు చేయడానికి అధికారులు పకడ్బందీ సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో చాలా చోట్ల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండగా.. ప్రభుత్వానికి చెందిన విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హుమ్టా అధికారులు చక్కని ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా స్థలాల్లో చిన్నచిన్న శాశ్వత షాపులు నిర్మించి వాటిని రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు అద్దెకు కేటాయించనున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు ప్రభుత్వ భూములు కబ్జాదారుల నుంచి సురక్షితంగా ఉంటాయి. అంతేకాకుండా చిరు వ్యాపారులకు శాశ్వత ఉపాధి లభించి వారి జీవనోపాధి మెరుగుపడుతుంది. ఈ ప్రత్యేక




ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దశలో నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యంగా అమీర్ పేట జంక్షన్, సత్యం థియేటర్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాల పార్కింగ్, చిన్న డబ్బాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తొలి విడతగా అమీర్ పేట ప్రాంతంలోనే అధికారికంగా వెండర్ జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులతో షాపులను నిర్మించి చిరు వ్యాపారులకు కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి క్రమం తప్పకుండా అద్దెల రూపంలో ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటి దశ ప్రయోగం విజయవంతమైన తర్వాత నగరంలోని జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ పరిధుల్లో ఉన్న మిగతా ప్రధాన చౌరస్తాలు, రోడ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను కూడా ఇదే పద్ధతిలో అభివృద్ధి చేయాలని హుమ్టా ప్రణాళిక రూపొందించింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారుల సహకారంతో ఈ సర్వేను వేగవంతం చేస్తున్నారు. అనధికార ఆక్రమణలను తొలగించి పారదర్శకమైన విధానంలో అర్హులైన చిరు వ్యాపారులకే ఈ షాపులను కేటాయించనున్నారు. దీనిద్వారా ప్రభుత్వ స్థలాలకు శాశ్వత రక్షణ లభించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు ఆదాయం సమకూరుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఏపీ బీజేపీకి ఏమైంది...

**విశాఖపట్టణం,** : ఏపీలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఆ పార్టీ అనుకున్న స్థాయిలో ముందుకెళ్లడం లేదు. పొత్తులో భాగంగా సీట్లు, ఓట్లు పెరిగాయే తప్ప.. గత రెండు సంవత్సరాలుగా ఆ పార్టీ పుంజుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ పార్టీలో పెద్దగా చేరికలు లేవు. చేరిన వారు సైలెంట్ గా ఉన్నారు. పాత నేతలు వ్యూహాత్మక సైలెన్స్ పాటిస్తున్నారు. పొత్తులో భాగంగా పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పని తాను చేసుకుంటున్నారు. ఎందుకో పార్టీని అభివృద్ధి చేసే ఆలోచన ఆ పార్టీ నేతల్లో కనిపించడం లేదు. ఏపీ విషయంలో హై కమాండ్ సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రాష్ట్ర మంత్రి ఉన్నారు. ఒక కేంద్రమంత్రి కొనసాగుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తన ముద్ర చూపలేకపోతోంది ఏపీలో. కనీస స్థాయిలో చురుకైన పార్టీ కార్యక్రమాలు కూడా లేవు. అదే తెలంగాణలో అయితే నిత్యం బిజెపి పెద్దల పర్యటనలు, ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఏపీలో అది సాధ్యం కాదు. ఎందుకంటే బిజెపి ఇక్కడ మిత్రపక్షం. అయితే పార్టీ పరంగా కూడా యాక్టివ్గా కార్యక్రమాలు లేవు. ఇతర పార్టీల నుంచి చేరికలు లేవు. ఫలితంగా ఆ పార్టీ అనుకున్న స్థాయిలో పుంజుకోలేకపోతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పివిఎన్ మాధవ్ వ్యవహరిస్తున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్నాక పార్టీ మరింత పుంజుకుంటుందని అంచనా వేశారు. కానీ ఎందుకో అనుకున్న స్థాయిలో



ముందుకు వెళ్లలేకపోతోంది. పార్టీ బాధ్యతలు తీసుకున్న కొత్తలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలకు సిద్ధపడ్డారు మాధవ్. తరువాత చురుకుదనం తగ్గింది. కేవలం కూటమితో ముందుకు వెళ్లడమే తప్పించి.. స్వతంత్రంగా ఏపీలో పార్టీ ముందుకెళ్లే పరిస్థితి లేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కనీసం బిజెపి ఉనికి చాటుకుంటుందా? లేదా అన్నది అనుమానమే. తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట కూడా స్థానిక నాయకత్వం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. అయితే భారీగా చేరికలు ఉంటాయని అప్పట్లో అంచనాలు ఉండేవి. కానీ ఎందుకో ఇప్పటికే చేరిన వారు యాక్టివ్ గా లేరు. అందుకే కొత్తగా ఎవరూ ముందుకు రావడం లేదు. మరి ఏపీ విషయంలో బిజెపి ఆలోచన ఏంటో ఇంతవరకు తెలియడం లేదు. ఇలా అయితే ఆ పార్టీకి కష్టమే

# గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి

**కాకినాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ–జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది. పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు.. లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు



ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదు అనే గుబులు జనసేన కిందిస్థాయి లీడర్లలో కనిపిస్తుంటే.. మెజారిటీ ఓటు బ్యాంకు మాదే, సీట్ల కేటాయింపులో సింహభాగం మాకే దక్కాలి అని తమ్ముళ్లు వాదిస్తున్నారు. ఈ పట్టువిడుపులు లేని ధోరణి ఉమ్మడి జిల్లాల అంతటా కూటమి సమన్వయాన్ని దెబ్బతీస్తోంది. అసెంబ్లీ సీట్ల సర్దుబాటు కంటే స్థానిక సంస్థల సీట్ల సర్దుబాటే చంద్రబాబు–పవన్ కళ్యాణ్‌లకు అసలైన పరీక్ష అని చెబుతున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే సీటు అనేది నియోజకవర్గానికి ఒక్కటే ఉంటుంది కాబట్టి నచ్చజెప్పడం సులువు. కానీ, వేలాదిగా ఉండే వార్డులు, వందలాదిగా ఉండే సర్పంచ్ స్థానాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సదరు లీడర్ రెబెల్‌గా మారే ప్రమాదం ఉంది లేదా పక్కనే పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. గోదావరి జిల్లాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా అది రాష్ట్ర వ్యాప్త కూటమి గ్రాఫ్‌పై ప్రభావం చూపిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే.. గోదావరి జిల్లాల గ్రామాల్లో తమ్ముళ్లు, సైనికుల మధ్య సాగుతున్న ఈ సీట్ల పంచాయితీని అధిష్టానం ఎంత త్వరగా సెటిల్ చేస్తే అంత మంచిది. పైస్థాయిలో ఉన్న దోస్తీ.. కిందిస్థాయి గడప దాకా చేరకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాల కోటల్లో అంతర్గత తిరుగుబాట్లు తప్పవు. మరి ఈ పొత్తుల రొంపి నుంచి ఇరు పార్టీల స్థానిక లీడర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎలా గట్టెక్కిస్తారో చూడాలి.

# కాపు ఓట్ల కోసం రేసు



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం ఓట్ల కోసం ఇప్పుడు రేసు ప్రారంభమయింది. అన్ని పార్టీలు కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు పోటీ పడుతున్నాయి. కాపు సమావేశాల పేరిట ఆ సామాజికవర్గానికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నాయి. వైసీపీ, టీడీపీ ఈ రకమైన ప్రయత్నాలు మొదలు పెట్టాయి. కాపులు తమ వెంటే ఉంటారని జనసేన మాత్రం కొంత వెనకబడి ఉన్నా పవన్ వెనకే ఉంటారన్న ధీమాలో ఉంది. ఇక బీజేపీ కూడా ఏ మాత్రం తగ్గడం లేదు. తరచూ సమావేశాలు పెట్టడంతో పాటు కాపు రిజర్వేషన్ల ఉద్యమాన్ని మరొకసారి తెరపైకి తెచ్చేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు సామాజికవర్గానికి అన్యాయం చేస్తుందని వైసీపీ ఆరోపిస్తుంది. కాపు కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేయకపోగా వారికి పదవుల విషయంలోనూ ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెబుతోంది. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బలంగా ఉన్న కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును తమ వైపునకు రప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే తోట త్రిమూర్తులు అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వెంకటాపురంలో వైసీపీ కాపు నేతలతో సమావేశమై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవ్వాలని నిర్ణయించారు. వైసీపీ తర్వాత అన్ని ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేసి కాపు నేతలతో పాటు ప్రజలను కూడా ఏకతాటిపైకి తేవాలని ప్రయత్నిస్తున్నాయి. త్వరలోనే మరొక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు వైసీపీ సిద్ధమవుతుంది... టీడీపీ కూడా కాపు సామాజికవర్గంలో బలం మరింత పెంచుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. కాపు సామాజికవర్గం టీడీపీ నేతలు సమావేశమై దీనిపై చర్చించారు. అంతేకాకుండా ప్రభుత్వంపై కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. దీనికి బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన కోస్తా జిల్లా నేత కావడంతో త్వరలోనే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించి టీడీపీ కాపు సామాజికవర్గం నేతలను ఏకం చేయాలని ప్రయత్నంలో ఉన్నారు. మరొకవైపు టీడీపీ కాపులకు ఇస్తున్న ప్రాధాన్యత మరే ప్రభుత్వంలో ఇవ్వడం లేదని ప్రచారం చేయాలని కూడా నిర్ణయించారు. అధినాయకత్వం ఆశీస్సులతోనే ఈ కార్యక్రమానికి టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. మొత్తం మీద ఈ రేసులో ఎవరిది పై చేయి అవుతుందన్నది రానున్న కాలమే చెబుతుంది.

**పదవుల కోసం తపన**

తెలుగుదేశం పార్టీలో కాపు నేతలు పదవుల కోసం పరితపిస్తున్నారు. ముఖ్యంగా తమకు మంత్రి పదవి దక్కలేదన్న భావన చాలా మందిలో ఉంది. జనసేన కారణంగానే తమకు మంత్రి పదవులు దక్కలేదన్న భావనలో వారిలో గట్టిగా ఉన్నట్లుంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తరచూ చేస్తున్న వ్యాఖ్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి. అందుకే వీలు దొరికినప్పుడల్లా టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అదే అర్థం వచ్చేలా చెబుతున్నాయి. జనసేనతో పొత్తు తర్వాత తమకు ప్రాధాన్యత తగ్గిందన్న భావన కనిపిస్తుంది. తమ పార్టీకి చెందిన నాయకత్వాన్నే ఆయన ప్రశ్నిస్తున్నారు. పదే పదే బొండా ఉమామహేశ్వరరావు చేస్తున్న కామెంట్స్ పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ బొండా ఉమామహేశ్వరరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మంత్రి పదవులు దక్కలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు మాత్రం మంత్రి పదవులు వచ్చాయన్నారు. కొలుసు పార్థసారధి, సవిత, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ లకు మంత్రి పదవులు దక్కడాన్ని ప్రశ్నించారు. తాము మాచర్లలోనూ అనేక ఘటనలోనూ పార్టీకోసం ఇబ్బందులు పడినా మంత్రి పదవులు రాలేదన్నారు. కానీ పార్టీని నమ్ముకుని మాత్రమే పనిచేస్తామని చెప్పిన బొండా ఉమామహేశ్వరరావు తాజాగా ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి కలకలం రేపాయి. ముద్రగడ పద్మనాభం సంతాప సభలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ముద్రగడ చేసిన పోరాటం వల్లే 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవాల్సి వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముద్రగడ సంతాప సభలో బొండా ఉమ వ్యాఖ్యలుముద్రగడ పద్మనాభం మరణం కాపు సామాజిక వర్గానికి తీరని లోటని ఆయన కొనియాడారు. కాపు జాతి హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం ముద్రగడ జీవితాంతం నిర్విరామంగా పోరాడారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను సాధించడమే ముద్రగడకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల సమయంలో ముద్రగడ చేపట్టిన ఉద్యమ ప్రభావం రాజకీయంగా తమ పార్టీపై గట్టిగా పడిందని, అందుకే టీడీపీ అధికారం కోల్పోయిందని ఓపెన్‌గా వ్యాఖ్యానించారు. అంతేకాదు.. పార్టీ నాయకత్వాన్ని కొందరు తప్పుదోవపట్టించి, ముద్రగడపై వ్యతిరేకత పెంచారని, అదే ఓటమికి కారణమయిందని అన్నారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని బొండా ఉమామహేశ్వరరావు చెప్పడం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ నేతలతో కలసి కార్యక్రమంలో పాల్గొన్నందుకు బొండా ఉమామహేశ్వరరావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నోటీసులు ఇవ్వాలని, వివరణ కోరాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు.

# ఐదేళ్లలో 100 శాతం పెరిగిన బిలీయనర్లు

**న్యూఢిల్లీ,** : భారతదేశంలోని అత్యంత సంపన్నుల క్లబ్ ఇప్పుడు మరింత రద్దీగా మారింది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పంచుకున్న డేటా ప్రకారం, అసెస్మెంట్ ఇయర్ 2025–26లో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని నివేదించిన వ్యక్తుల సంఖ్య 576కి పెరిగింది. ఏఐ 2024–25లో ఇదే సంఖ్య 415గా ఉంది. దేశంలో బిలియనీర్ల సంఖ్యలో పెరుగుదలను ప్రభుత్వం గమనించిందా అనే ప్రశ్నకు సమాధానంగా, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు. కొన్నేళ్లుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందింది. స్టాక్ మార్కెట్ అనూహ్యంగా పుంజుకోవడం, స్టార్టప్‌ల విస్తరణ, కొత్త కర్మాగారాలు, పరిశ్రమలలో పెట్టుబడులు, డిజిటల్ వ్యాపారాల విస్తరణ, పెరుగుతున్న కార్పొరేట్ లాభాల ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి అత్యంత స్పష్టమైన నిదర్శనం పార్లమెంటులో ప్రభుత్వం ఇటీవల గణాంకాలను సమర్పించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం, 2025–26 అసెస్మెంట్ సంవత్సరంలో 576 మంది వ్యక్తులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక స్థూల ఆదాయాన్ని ప్రకటించారు. ఐదు సంవత్సరాల క్రితం 2021–22లో ఈ సంఖ్య కేవలం 142 మాత్రమే. అంటే ఐదేళ్లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ సంపాదించే వ్యక్తుల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఐటీఆర్‌లలో రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక స్థూల ఆదాయాన్ని ప్రకటించిన వ్యక్తులను మాత్రమే ప్రభుత్వం లెక్కించింది.

రూ.100 కోట్లకుపైబడిన ఆదాయం ఉన్నవారు

2021–22 ఆర్థిక సంవత్సరంలో 142 మంది

2022–23లో 205 మంది

2023–24లో 395 మంది

2024–25లో 415 మంది

2025–26లో 576 మంది ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, భారతదేశంలో వేగంగా జరుగుతున్న సంపద సృష్టికి ఇది ఒక సంకేతం. అలాగే ఇది ఆదాయపు పన్ను పరిధిని కూడా బలోపేతం చేస్తుంది. పార్లమెంటులోని ప్రశ్న 'బిలియనీర్ల'ను ప్రస్తావించినప్పటికీ, బిలియనీర్‌కు తమ వద్ద అధికారిక నిర్వచనం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దానికి బదులుగా, దేశంలోని అత్యధిక ఆదాయం సంపాదించేవారికి ప్రత్యామ్నాయంగా, రూ. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని నివేదించే పన్ను చెల్లింపుదారుల ఆదాయపు పన్ను రిటర్న్ డేటాపై ఇది ఆధారపడింది. 100 కోట్ల క్లబ్ ఆవిర్భావం ప్రభుత్వానికి ఒక సానుకూల సంకేతంగా కూడా కనిపిస్తోంది. ఎక్కువ ఆదాయ ప్రకటనలు రావడం వల్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల మౌలిక సదుపాయాలు, సామాజిక కార్యక్రమాలు, మూలధన వ్యయాల కోసం ప్రభుత్వానికి మరిన్ని వనరులు సమకూరుతాయి.

# ఉండవల్లికి కీలక బాధ్యతలు..

**రాజమండ్రి,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎప్పుడూ ఒక ఆసక్తికర చర్చగా మారుతూ వస్తుంది. ఒకప్పుడు రాష్ట్రాన్ని ఏలిన ఈ పార్టీ విభజన తర్వాత వరుసగా జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. చాలా ప్రాంతాల్లో డిపాజిట్లు కోల్పోయి కేవలం రెండు శాతం ఓటు బ్యాంకుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఇలాంటి క్లిష్టమైన సమయంలో పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి చాలా మంది సీనియర్ నేతలు వెనకడుగు వేస్తూ వచ్చారు. విభజన అనంతరం రఘువీరా రెడ్డి, సాకే శైలజానాథ్, ఆ తర్వాత గోదావరి జిల్లాకు చెందిన నేతతో పాటు ప్రస్తుతం వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే రానున్న రోజుల్లో ఏపీ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే హైకమాండ్ ఏపీ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పార్టీకి కొత్త జవసత్వాలు అందించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈసారి సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ తూకాలను ఖచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. ఏపీలో అత్యంత బలమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేతకు పీసీసీ పీఠం దక్కే అవకాశం ఉందని సమాచారం. 2029 ఎన్నికల లక్ష్యంగా ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే నాయకత్వ మార్పుతో పాటు కమిటీల ప్రక్షాళన చేపట్టాలని నిర్ణయించారు. గతంలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని హైకమాండ్ కోరిన ఒక సీనియర్ పెద్దాయన సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కేంద్రంలో కీలక మంత్రి పదవులు నిర్వహించిన ఆ గోదావరి జిల్లా నేతకు బాధ్యతలు ఇస్తే పార్టీ పుంజుకుంటుందని భావించారు. అయితే జాతీయ స్థాయిలో మారుతున్న రాజకీయ పరిణామాలు, దక్షిణాదిన కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఆ పెద్దాయన ఆలోచనలో మార్పు వచ్చినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇమేజ్, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆ నేతలు లెక్కలు వేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో నెలకొన్న శూన్యతను భర్తీ చేయడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నారు. ఈ రేసులో ఉత్తరాంధ్ర నుంచి ఒక కేంద్ర మాజీ మంత్రి పాటు రాయలసీమ ప్రాంతం నుంచి పలువురు సీనియర్ నాయకులు తీవ్ర ఆసక్తి కనబరుస్తున్నారు. గడచిన ఎన్నికల ఫలితాలతో పోలిస్తే 2029 ఎన్నికల వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు నమ్ముతున్నాయి. వైఎస్ షర్మిల నాయకత్వంలో జరిగిన ప్రయత్నాలు ఒక బేస్‌ను ఏర్పాటు చేశాయని, ఇప్పుడు దానిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలపై నమ్మకం ఉన్న ప్రజలు ఇంకా ఉన్నారని, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటే పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# యాపిల్‌లో మరోసారి లేఆఫ్స్...!



గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ తన సంస్థలో ఉద్యోగుల తొలగింపులను చేపట్టినట్లు ధ్రువీకరించింది. బిజినెస్ రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా వివిధ విభాగాలకు చెందిన కొంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు యాపిల్ తెలిపింది. డిజిటల్ సర్వీసెస్, కార్పొరేట్ టీమ్‌లతో పాటు అనేక ఇతర కీలక విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై ఈ ప్రభావం పడినట్లు సమాచారం. ఈ ప్రక్రియపై యాపిల్ సంస్థ అధికారికంగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. “మా వ్యాపార వ్యూహాలకు అనుగుణంగా వనరులను తిరిగి సమర్థవంతంగా కేటాయించే క్రమంలో భాగంగా కొన్ని విభాగాల్లో మార్పులు చేపడుతున్నాం. ఈ మార్పుల ద్వారా భవిష్యత్తులో కొత్త ఉద్యోగ అవకాశాలు పుట్టుకొచ్చినప్పటికీ, దురదృష్టవశాత్తు కొంతమంది ఉద్యోగులను తొలగించక తప్పడం లేదు” అని కంపెనీ వివరించింది. ప్రభావితమైన ఉద్యోగులకు తగిన పరిహారం అందించడంతో పాటు ఇతర అంతర్గత విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది. యాపిల్ సాధారణంగా ఇతర టెక్ దిగ్గజాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా సంస్థలతో పోలిస్తే భారీస్థాయి లేఆఫ్స్‌కు దూరంగా ఉంటుంది. కానీ, మారుతున్న సాంకేతిక విపణి సవాళ్లు, ఆరిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మరింత శ్రద్ధ పెట్టడం మరియు ప్రాజెక్టుల ప్రాధాన్యతల్లో మార్పుల కారణంగా యాపిల్ సైతం

ఈ రకమైన కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదని టెక్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కంపెనీలోని ఏయే విభాగాల నుండి ఎంతమంది ఉద్యోగులను తీసివేశారనే ఖచ్చితమైన సంఖ్యను యాపిల్ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ తన సంస్థలో ఉద్యోగుల తొలగింపులను చేపట్టినట్లు ధ్రువీకరించింది. బిజినెస్ రీస్ట్రక్చరింగ్‌లో (పునర్వ్యవస్థీకరణ) భాగంగా వివిధ విభాగాలకు చెందిన కొంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు యాపిల్ తెలిపింది. డిజిటల్ సర్వీసెస్, కార్పొరేట్ టీమ్‌లతో పాటు అనేక ఇతర కీలక విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై ఈ ప్రభావం పడినట్లు సమాచారం.


# టాటా కార్ల ధరలు మళ్లీ పెంపు..?

దేశంలోని దిగ్గజ వాహన కంపెనీలన్నీ తమ ధరలను వరుసగా పెంచుతున్నాయి. పశ్చిమాసియా ఘర్షణలు, రూపాయి పతనం, ముడి సరుకుల ధరల పెరుగుదలతో ఆ భారాన్ని వినియోగదారులపై మోపాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే మారుతి సుజుకి, హ్యుందాయ్ ధరలను పెంచగా అదే బాటలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టిఎంపివి) నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న ముడిసరుకు, కమోడిటీ ఖర్చులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా తమ కార్లు, ఎస్‌యువి ధరలను సెప్టెంబర్ 1 నుండి రూ. 25,000 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.

పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వెహికల్స్ రెండింటిపై వర్తించే ఈ ధరల పెంపు మోడల్, వేరియంట్‌ను బట్టి మారుతుందని తెలిపింది. తయారీ వ్యయ భారాన్ని కొంతవరకు మాత్రమే వినియోగదారులపైకి మారుస్తున్నామని కంపెనీ తెలిపింది. కాగా ఈ త్రైమాసికంలో టాటా మోటార్స్ కార్ల ధరలను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం. గత జూన్‌లోనూ ధరలను 1.5 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే.




# పెరిగిన బ్యాంక్ డిపాజిట్లు కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ వెల్లడి



బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకం, పొదుపు ధోరణి పెరుగుతోంది. గత కొంత కాలంగా స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒత్తిడి నెలకొనడంతో ఇటీవల డిపాజిట్లపై ప్రజలు ఆసక్తి కనబర్చుతున్నారు. బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకం, పొదుపు ధోరణి పెరుగుతోంది. ఈ ఏడాది జులై 31 నాటికి బ్యాంకుల డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2016 డిసెంబర్ తర్వాత డిపాజిట్ల వృద్ధి ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అంతక్రితం జులై 15 నాటికి డిపాజిట్ల వృద్ధి 12.7 శాతంగా ఉండగా, గతేడాది ఇదే సమయంలో 10 శాతంగా నమోదయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక స్వాప్ సదుపాయం కింద విదేశీ కరెన్సీ ప్రవాస భారతీయుల బ్యాంకు డిపాజిట్లకు భారీ స్పందన లభించడం ఈ వృద్ధికి ప్రధాన కారణమని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ పేర్కొంది. జులై 31 నాటికి ఈ సదుపాయం ద్వారా సమీకరించిన నిధులు 36.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో బ్యాంకులకు అదనపు విదేశీ మారకద్రవ్య నిధులతో పాటు ద్రవ్యలభ్యత కూడా పెరిగిందని నివేదిక తెలిపింది. బ్యాంకింగ్ వ్యవస్థలో మొత్తం డిపాజిట్లు రూ.269.4 లక్షల కోట్లకు చేరాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే రూ.6.57 లక్షల కోట్ల మేర కొత్త డిపాజిట్లు వచ్చాయి. ఇందులో కాలపరిమితి డిపాజిట్లు 14.8 శాతం వృద్ధితో రూ.235.1 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం డిపాజిట్లలో వీటి వాటా 87.3 శాతంగా ఉంది. మరోవైపు డిమాండ్ డిపాజిట్లు కూడా 19.3 శాతం వృద్ధి చెందడం బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకం, పొదుపు ధోరణి బలపడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది. డిపాజిట్ల పెరుగుదలకు అనుగుణంగా బ్యాంకుల రుణ విస్తరణ కూడా కొనసాగుతోంది.

దీంతో బ్యాంకులకు అదనపు విదేశీ మారకద్రవ్య నిధులతో పాటు ద్రవ్యలభ్యత కూడా పెరిగిందని నివేదిక తెలిపింది. బ్యాంకింగ్ వ్యవస్థలో మొత్తం డిపాజిట్లు రూ.269.4 లక్షల కోట్లకు చేరాయి. రిటైల్ రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సేవలు, మౌలిక వసతులు, ఎన్‌బిఎఫ్‌సిలకు రుణాల అందజేత పెరగడంతో జులై 31 నాటికి బ్యాంకుల రుణ వృద్ధి 19.3 శాతానికి చేరుకుంది. మొత్తం బకాయి రుణాలు రూ.220.8 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. డిపాజిట్ల వృద్ధి వేగం పెరగడంతో రుణాలు, డిపాజిట్ల మధ్య వ్యత్యాసం కూడా తగ్గింది.

రుణాలు డిపాజిట్ల నిష్పత్తి 82.7 శాతం నుంచి 81.9 శాతానికి తగ్గడం బ్యాంకుల నిధుల స్థితి మరింత సమతుల్యతకు నిదర్శనమని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ప్రతి వారం ఒక సౌత్ సినిమా



ఈ ఏడాది పెద్ద సంఖ్యలో సినిమాల జాబితాతో ఆకట్టుకునేందుకు సిద్ధమైన నెట్‌ఫ్లిక్స్, ద్వితీయార్థంలో ప్రతి వారం తమిళ, తెలుగు, మలయాళ భాషల నుండి ఒక కొత్త సినిమాను విడుదల చేయనుంది. 2026, ప్రథమార్థంలో 'మేడ్ ఇన్ కొరియా' వంటి చిత్రాలు 54 దేశాల్లో ట్రెండ్ అయి రికార్డు విజయం సాధించిన వేగంతోనే, రాబోయే రోజుల్లో రామ్‌చరణ్ 'పెద్ది', విజయ్ దేవరకొండ 'రణబాలి', నాని 'ప్యారడైజ్', ధనుష్ 'ఓం' వంటి భారీ చిత్రాలతో పాటు 'సూపర్ సుబ్బు' (తెలుగు), 'ది గేమ్' (తమిళం) వంటి ఒరిజినల్ సిరీస్‌లను ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. మైత్రి మూవీ మేకర్స్, ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో బ్లాక్‌బస్టర్లతో పాటు కథాబలమున్న చిత్రాలకు వేదికగా నిలుస్తున్న నెట్‌ఫ్లిక్స్, దక్షిణాది ప్రామాణిక కథలను ప్రపంచవ్యాప్తంగా దాదాపు 59 దేశాల టాప్-10 జాబితాలోకి చేర్చి సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ సహ వ్యవస్థాపకుడు నవీన్ యెర్నేని మాట్లాడుతూ, భారీ స్థాయిలో రూపొందిన 'పుష్ప 2' చిత్రంతో నెట్‌ఫ్లిక్స్‌తో మా భాగస్వామ్యం ప్రారంభమైంది.


# ఆరు నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు



దేశ ఆర్థిక వ్యవస్థకు ఆందోళన కలిగించే విధంగా భారత్ వాణిజ్య లోటు భారీగా పెరిగింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ రవాణా వ్యయాల పెరుగుదల నేపథ్యంలో జులైలో దేశ వస్తు వాణిజ్య లోటు 31.98 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది ఆరు నెలల గరిష్ఠ స్థాయి కావడం ఆందోళనకరం. జూన్‌లో నమోదైన 30.43 బిలియన్ డాలర్లతో పోలిస్తే లోటు మరింత పెరిగింది. ఆర్థికవేత్తలు అంచనా వేసిన 30.20 బిలియన్ డాలర్ల కంటే కూడా ఇది అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది. దిగుమతుల వేగం పెరగడమే వాణిజ్య లోటు విస్తరణకు ప్రధాన కారణంగా నిలిచింది. జులైలో దేశ దిగుమతులు 76.22 బిలియన్ డాలర్లకు చేరాయి. జూన్‌లో ఇవి 70.84 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం దిగుమతులు భారీగా పెరగడం విదేశీ మారకద్రవ్యంపై ఒత్తిడిని పెంచుతోంది. ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు 44 శాతానికి పైగా పెరిగి 14.37 బిలియన్ డాలర్లకు చేరగా, బంగారం దిగుమతులు దాదాపు 5 శాతం పెరిగి 4.16 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతుల పెరుగుదల ప్రభావం దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు, రూపాయి విలువపై పడే అవకాశం ఉంది. వాణిజ్య లోటు ఎక్కువ కాలం కొనసాగితే దిగుమతుల కోసం విదేశీ మారకద్రవ్య డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా రూపాయిపై ఒత్తిడి పెరగడంతో పాటు విదేశీ పెట్టుబడుల ప్రవాహంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితికి ఇది అదనపు భారంగా మారవచ్చు. ఎగుమతులు కొంత పెరిగినప్పటికీ.. దిగుమతుల వేగాన్ని అధిగమించలేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. జులైలో వస్తు ఎగుమతులు 44.24 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది 2022 జులైలో నమోదైన 38.34 బిలియన్ డాలర్ల మునుపటి గరిష్ఠాన్ని అధిగమించింది. అయితే భారీ దిగుమతుల కారణంగా ఎగుమతుల పెరుగుదల వాణిజ్య లోటును నియంత్రించలేకపోయింది.

సేవల రంగంలో భారత్‌కు 16.95 బిలియన్ డాలర్ల మిగులు నమోదైనప్పటికీ, వస్తు వాణిజ్య లోటు పెరుగుదల ఆర్థిక వ్యవస్థకు సవాలుగానే మారుతోంది. ఏప్రిల్ నుంచి జులై వరకు అమెరికాకు 33.49 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను భారత్ ఎగుమతి చేసింది. అయితే అమెరికా విధించిన కొత్త సుంకాలు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో మార్పులు రానున్న నెలల్లో ఎగుమతులపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చన్న ఆందోళన ఉంది.

# అమెరికాతో రూ.3800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం..!




చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసును పరిష్కరించుకునేందుకు ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకొచ్చింది. ఇందుకుగాను ఆ దేశ న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,800 కోట్లు) చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తాన్ని రెండు దఫాలలో చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీంతో 2024లో దాఖలైన ఈ వ్యాజ్యం ముగిసింది.

టిక్‌టాక్ తమతో రాజీ చేసుకోవడం దేశంలోని పిల్లలు, తల్లిదండ్రులకు ఒక పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం.. వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా యాప్‌లు గోప్యంగా ఉంచేలా పర్యవేక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు, పిల్లల కోసం ఉద్దేశించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా ఆధారిత మాతృ సంస్థ బైట్‌డాన్స్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ.. 2024లో న్యాయ శాఖ వ్యాజ్యం దాఖలు చేసింది. నాటి నుంచి టిక్‌టాక్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థ తన వాటాలను తగ్గించుకుంది. దీంతో కొత్త టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడానికి ఒరాకిల్, సిల్వర్ లేక్, ఎమిరేట్స్ పెట్టుబడి సంస్థ ఎంజీఎక్స్ వంటి ప్రధాన పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంది.

# మారుమూల ప్రాంతాలకూ స్టార్‌లింక్ ఇంటర్నెట్...




భారత్‌లోని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో తగినంత ఇంటర్నెట్ సేవలు అందని వారికి స్టార్‌లింక్ సహాయపడగలదని ఆ కంపనీ అధినేత ఎలన్ మస్క్ ఎక్స్‌లో తెలిపారు. పట్టణాలతో పోలిస్తే ఇంకా వేలాది గ్రామాల్లో 4జి కవరేజీ లేని నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం స్టార్‌లింక్ గతంలో జెన్ 2 శాటిలైట్ నెట్‌వర్క్ నిమిత్తం దరఖాస్తు చేసుకోగా.. రేడియో ఫ్రీక్వెన్సీలు భారత నిబంధనలకు అనుగుణంగా లేవన్న కారణంతో ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ దానిని తిరస్కరించింది. ఈ నేపథ్యంలో స్టార్‌లింక్ తాజాగా మరోసారి కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్ (ఎల్‌ఇఒ) కక్ష్యలో పరిభ్రమించే సుమారు 6,000 ఉపగ్రహాల ద్వారా తక్కువ లేటెన్సీతో కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాలకు సైతం వేగవంతమైన ఇంటర్నెట్ సేవలను అందించేందుకు స్టార్‌లింక్ సిద్ధమవుతోంది.

# రక్తదానం ఎవరు చేయొచ్చు?



మనం చేసే రక్తదానం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడటంలో సహాయపడుతుంది. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో రక్తస్రావం, తీవ్రమైన అనారోగ్యాలు వంటి అనేక సందర్భాల్లో రక్తం అవసరం అవుతుంది. అయితే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులు కాదు. కొన్ని ఆరోగ్య పరిస్థితుల్లో తాత్కాలికంగా రక్తదానం చేయకూడదు. మరికొన్ని సందర్భాల్లో దీర్ఘకాలం లేదా శాశ్వతంగా రక్తదానానికి దూరంగా ఉండాల్సి రావచ్చు. అందుకే రక్తదానం చేయాలనే ఆసక్తి మాత్రమే కాకుండా.. మన ఆరోగ్య పరిస్థితి గురించి రక్తదానం చేసే కేంద్రంలోని వైద్య సిబ్బందికి సరైన సమాచారం అందించడం కూడా చాలా ముఖ్యం. భారత్‌లో సాధారణంగా రక్తదానం చేయాలంటే వ్యక్తి వయసు 18 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉండాలి. తొలిసారి రక్తదానం చేసే వ్యక్తి వయసు 60 సంవత్సరాలకు మించకూడదు. రెగ్యులర్‌గా రక్తదానం చేసేవారికి గరిష్ఠ వయసు 65 సంవత్సరాలుగా ఉంటుంది. రక్తదాత బరువు కనీసం 45 కిలోల ఉండాలి. 350 మి.లీ. రక్తదానం చేయడానికి కనీసం 45 కిలోల బరువు అవసరం కాగా.. 450 మి.లీ. రక్తదానం కోసం సాధారణంగా 55 కిలోల కంటే ఎక్కువ బరువు ఉండాలి. రక్తదానం చేసే ముందు హీమోగ్లోబిన్, రక్తపోటు, పల్స్, శరీర ఉష్ణోగ్రతతో పాటు ఇతర ఆరోగ్య ప్రమాణాలను వైద్య సిబ్బంది పరిశీలిస్తారు. 2025లో అమల్లో ఉన్న రక్తదాతల ఎంపిక మార్గదర్శకాల ప్రకారం పురుషులు సాధారణంగా 90 రోజుల విరామంతో, మహిళలు 120 రోజుల విరామంతో మరోసారి పూర్తి రక్తాన్ని దానం చేయవచ్చు. అయితే తుది అర్హతను రక్తదాన కేంద్రంలోని వైద్య పరీక్షల తర్వాతే నిర్ణయిస్తారు. జ్వరం, ఫ్లూ, వైరల్ ఇన్ఫెక్షన్ లేదా ఇతర క్రియాశీల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న సమయంలో రక్తదానం చేయకూడదు. పూర్తిగా కోలుకున్న తర్వాతే రక్తదానం చేయడం మంచిది. ఇటీవల ఏదైనా అనారోగ్యానికి గురైనట్లయితే.. రక్తదానం చేసే ముందు వైద్య సిబ్బందికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. రక్తదానానికి కనీస బరువు ప్రమాణం ఉంటుంది. బరువు తక్కువగా ఉన్న వ్యక్తి నుంచి రక్తం తీసుకోవడం వల్ల దాత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే రక్తదానం చేసే ముందు బరువును కూడా పరీక్షిస్తారు. గర్భధారణ సమయంలో మహిళలు రక్తదానం చేయకూడదు. ఈ సమయంలో తల్లి, గర్భంలోని శిశువు ఇద్దరికీ తగినంత పోషకాలు, రక్త సరఫరా అవసరం ఉంటుంది. ప్రసవం తర్వాత కూడా వెంటనే రక్తదానం ప్రారంభించకూడదు.

# డ్రాగన్ ఫ్రూట్ అందరికీ మంచిదేనా..?



డ్రాగన్ ఫ్రూట్ చూడటానికి ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా, ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉండే పండుగా చాలామందికి తెలుసు.

అందుకే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు, బరువు నియంత్రించుకోవాలనుకునేవారు దీన్ని తమ ఆహారంలో చేర్చుకుంటున్నారు. అయితే ఒక ఆహారం ఆరోగ్యకరమైనదని చెప్పడం మాత్రమే కాకుండా, అది ఎవరికి ఎలా సరిపోతుందో కూడా తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను ఎక్కువగా తీసుకుంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అలర్జీలు, మధుమేహం లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకునే విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం. అయితే ప్రతి ఒక్కరూ ఈ పండును పూర్తిగా మానేయాల్సిన అవసరం ఉందని చెప్పడం సరికాదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, తీసుకుంటున్న మందులు, ఆహారపు అలవాట్లను బట్టి పరిమాణం మారవచ్చు. మరి ఎలాంటి వారు డ్రాగన్ ఫ్రూట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి? డ్రాగన్ ఫ్రూట్ తిన్న తర్వాత కొంతమందిలో అలర్జీ ప్రతిచర్యలు కనిపించే అవకాశం ఉంది. దురద, పెదవులు లేదా నాలుక వాపు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే దీనిని తినడం ఆపాలి. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

# లవంగాల పాలు ఔషధాల గని...



సీజన్ మారిన ప్రతిసారి వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి లవంగాల పాలు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. భారతీయ వంటింట్లో దొరికే లవంగాలు, పాల కలయిక శరీరానికి ఎనలేని శక్తిని ఇస్తుంది. ప్రశాంతమైన నిద్ర పడుతుంది.రోగనిరోధక శక్తి పెంపు: లవంగాలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పాలతో కలిసి తీసుకున్నప్పుడు శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. చలికాలంలో వ్యాపించే రకరకాల ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. జలుబు, గొంతు నొప్పి నుండి ఉపశమనం: లవంగాలలో ఉండే యూజినాల్ అనే కాంపౌండ్ యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలను కలిగి ఉంటుంది.

గొంతు నొప్పి, పొడి దగ్గు, నాసికా రంధ్రాల మూసుకుపోవడం వంటి సమస్యలతో బాధపడేవారు లవంగాల పాలు తాగడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: రాత్రి వేళ లవంగాల పాలు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఇది కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను సమర్థవంతంగా నివారిస్తుంది. ఆహారం త్వరగా అరగడానికి సహాయపడుతుంది. ఎముకలు, పళ్ల ఆరోగ్యానికి మేలు: పాలలో క్యాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉంటాయి. లవంగాలలో ఉండే మాంగనీస్ ఎముకల సాంద్రతను పెంచడానికి ఉపయోగపడుతుంది.

# వర్షాకాలంలో ఖర్జూరాలు తినొచ్చా?



ఖర్జూరాలు ప్రకృతి మనకు అందించిన అత్యంత తీపి, పోషకమైన పండ్లలో ఒకటి. ప్రాసెస్ చేసిన స్వీట్లకు ప్రత్యామ్నాయంగా, ఆరోగ్యకరమైన తీపిని కోరుకునే వారికి ఇవి ఒక అద్భుతమైన ఎంపిక. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్లశరీరానికి కావలసిన ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. అయితే, వర్షాకాలంలో ఖర్జూరాలు తినేవారు ఈ విషయాలు తప్పక తెలుసుకోవాలి. పోషకాల గని: ఖర్జూర పండ్లు రుచికే కాకుండా అద్భుతమైన పోషక విలువలకు నిలయం. ఒక మోస్తరు పరిమాణంలో ఉండే ఖర్జూరాల్లో శరీరానికి అవసరమైన విటమిన్ ః6, పొటాషియం, మెగ్నీషియం, రాగి, మాంగనీస్, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. వీటిలో కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థకు కొండంత అండ: ఖర్జూరాలలో పీచు పదార్థం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. క్రమం తప్పకుండా ఖర్జూరాలు తీసుకోవడం వల్లమలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు నయమవుతాయి. తక్షణ శక్తి, మెరుగైన గుండె ఆరోగ్యం: ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజసిద్ధమైన చక్కెరలు ఉండటం వల్ల నీరసంగాఉన్నప్పుడు ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. అలాగే, ఖర్జూరాల్లోని పొటాషియం, మెగ్నీషియం సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఇవి రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ చేరకుండా కాపాడి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

# దమ్ము, ధైర్యం ఉంటే క్లారిటీగా మాట్లాడు!



ప్రముఖ యాంకర్, నటి అనసూయ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కొంతకాలం క్రితం ఆమె సోషల్ మీడియాలో దేవుడి ఫొటోలు పెట్టుకుని 'జై శ్రీరామ్' అంటూ 'జై హింద్', 'వందేమాతరం' వంటి పదాలను ప్రస్తావిస్తూ ఓ వీడియో విడుదల చేసింది. అందులో ఆమె చేసిన వ్యాఖ్యలపై పలువురు ఫైర్ అయ్యారు. ఆ తర్వాత అనసూయ దీనిపై క్లారిటీ ఇస్తూ మరో వీడియోను కూడా విడుదల చేసింది. తాజాగా టాలీవుడ్ సీనియర్ నటి హేమ, అనసూయ వ్యాఖ్యలపై స్పందించింది. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. మనం అద్దాల మేడలో బతుకుతున్నాం. మనం చేసే ప్రతి పనినీ భూతద్దంలో పెట్టి చూస్తుంటారు. నీ పర్సనల్ జీవితం నీ ఇష్టం. కానీ కోట్ల మంది విశ్వసించే విషయాల గురించి మాట్లాడుతున్నప్పుడు ఎంతో జాగ్రత్తగా మాట్లాడాలి. మనం మాట్లాడే మాటలకు, చేసే పనులకు సంబంధం లేకపోతే ప్రజలు ఈజీగా పసిగట్టేస్తారు. జై శ్రీరామ్ అనేది ఒక స్లోగన్ కాదు. కోట్ల మంది హృదయాల్లో నిలిచిపోయిన ఒక మంత్రం.

జై శ్రీరామ్ అనేది ఒక పవర్. నువ్వు ఎవరినైనా అనాలి అనుకున్నప్పుడు సూటిగా ఆ వ్యక్తి పేరు చెప్పి అనాలి. కానీ నువ్వు దేవుళ్ల ఫొటోలు పెట్టుకుని జై శ్రీరామ్ అంటూ మరికొన్ని పదాలు అన్నావు. అవి నాకు నచ్చలేదు. నువ్వు అలా అనడం సరికాదు. ఆ తర్వాత నువ్వు అందరినీ అనలేదని అన్నావు.


నువ్వు ఎవరిని ఉద్దేశించి అన్నావో దమ్ము, ధైర్యం ఉంటే వారి పేరు పెట్టి నేరుగా అనాలి. అంతేకానీ హిందువుల మనోభావాలను దెబ్బతీయకు. కర్మ రిటర్న్నును నేను కచ్చితంగా నమ్ముతాను. నువ్వు చేసిన దానికి కూడా కచ్చితంగా అనుభవిస్తావని హేమ వ్యాఖ్యానించింది. తాజాగా హేమ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

# అమ్మోరు పాత్రలో మళ్లీ నయనతార



లేడీ సూపర్‌స్టార్ నయనతార మరోసారి దేవత పాత్రలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 2020లో జియోహాట్‌స్టార్ ఓటీటీలో నేరుగా విడుదలై మంచి స్పందన అందుకున్న 'మూకుతి అమ్మన్'కు ఇప్పుడు సీక్వెల్‌గా 'మూకుతి అమ్మన్ 2' తెరకెక్కుతోంది. దర్శకుడు సుందర్ సి రూపొందిస్తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే అంచనాలు కూడా బాగానే ఉన్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కుల విషయంలో కూడా పెద్ద వార్త వినిపిస్తోంది. జియోహాట్‌స్టార్ ఈ సినిమా ఓటీటీ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం 'మూకుతి అమ్మన్ 2' డిజిటల్ హక్కుల కోసం జియోహాట్‌స్టార్‌తో చిత్రబృందం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ డీల్ విలువ ఎంత అన్నది వెల్లడికాలేదు. మొత్తాన్ని బయటపెట్టకపోయినా, ఇది మంచి ఫ్యాన్సీ రేటుకే వెళ్ళినట్లు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో నయనతార మరోసారి అమ్మన్ (అమ్మోరు తల్లి) పాత్రలో కనిపించనుండగా, ఈసారి కథలో ప్రతినాయకురాలిగా రెజీనా కసాండ్రా నటిస్తున్నట్లు సమాచారం. దర్శకుడు సుందర్ సి తనదైన శైలిలో ఫాంటసీ, కామెడీ, సామాజిక వ్యంగ్యాన్ని కలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ ఆధ్యాత్మిక గురువులను వ్యంగ్యంగా బట్టబయలు చేసే కథ అప్పట్లో మంచి ఆదరణ పొందింది. ముఖ్యంగా సోషల్ మెసేజ్ ని కామెడీ స్టైల్ లో చూపించిన తీరు సినిమాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. మొదటి భాగంలో నయనతారతో పాటు ఆర్.జే. బాలాజీ, ఊర్వశి, స్మృతి వెంకట్, అభినయ, మౌళి, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఆ సినిమా నేరుగా ఓటీటీలో విడుదలైనా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కించుకుంది. ఇప్పుడు రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నయనతార చేతిలో వరుస క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. యష్ హీరోగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' లో ఆమె కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆ భారీ పాన్ ఇండియా మూవీ 2026 ఆగస్టు 26న విడుదల కానుంది.

# ఆ క్రేజీ బ్యానర్‌లో శివ నిర్వాణ నెక్స్ట్ సినిమా కన్ఫర్మ్



టాలెంటెడ్ దర్శకుడు శివ నిర్వాణ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈయన తాజాగా రవితేజ హీరోగా తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రానికి దర్శకత్వం వహించారు. నిన్న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ ముందుకు దూసుకుపోతోంది. 'టక్ జగదీష్', 'ఖుషి' చిత్రాలతో కాస్త విమర్శలను ఎదుర్కొన్న ఈ దర్శకుడు.. తిరిగి 'ఇరుముడి' చిత్రంతో మంచి ఫామ్‌లోకి వచ్చారు. దీంతో ఈ క్రేజీ దర్శకుడు తన తదుపరి మూవీని ఎవరితో చేస్తారనే ఉత్కంఠ చాలామందిలో నెలకొంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం శివ నిర్వాణ తన తదుపరి మూవీని 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై చేయబోతున్నట్లు సమాచారం. బ్యానర్ ఓకే అయినప్పటికీ హీరో మాత్రం ఇంకా కన్ఫామ్ కాలేదని తెలుస్తోంది.

మరి శివ నిర్వాణ తన తదుపరి మూవీని ఏ హీరోతో చేస్తారనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. ఇప్పటికే ఈ బ్యానర్‌లో శివ నిర్వాణ 'మజిలీ', 'టక్ జగదీష్' అనే రెండు చిత్రాలు చేశారు. ఇందులో 'మజిలీ' అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకోగా, 'టక్ జగదీష్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైంది. ఇప్పుడు ఇదే బ్యానర్‌లో మూడో సినిమా చేయడానికి శివ నిర్వాణ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

ఈయన తాజాగా రవితేజ హీరోగా తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రానికి దర్శకత్వం వహించారు. నిన్న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ ముందుకు దూసుకుపోతోంది. 'టక్ జగదీష్', 'ఖుషి' చిత్రాలతో కాస్త విమర్శలను ఎదుర్కొన్న ఈ దర్శకుడు.. తిరిగి 'ఇరుముడి' చిత్రంతో మంచి ఫామ్‌లోకి వచ్చారు. దీంతో ఈ క్రేజీ దర్శకుడు తన తదుపరి మూవీని ఎవరితో చేస్తారనే ఉత్కంఠ చాలామందిలో నెలకొంది.

# ఆ ఫ్యాన్ గర్ల్ అనుభవం తర్వాత నాకు అసలు నిద్ర పట్టలేదు




తెలుగులో 'పుష్పక విమానం', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న శాన్వి మేఘన, ప్రస్తుతం కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టి తన ప్రతిభను చాటుకుంటున్నారు. 'ప్యార్ ప్రేమ కళ్యాణం' చిత్రంతో కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వగా ఈ రొమాంటిక్ కామెడీ మూవీ నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దర్శకుడిగానే కాకుండా ఎలాన్ ఇందులో హీరోగా పరిచయమవడం విశేషం. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శాన్వి మేఘన ఓ ఫ్యాన్ గర్ల్ అనుభవాన్ని గుర్తు చేసుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నుంచి ఊహించని మెసేజ్ రావడంతో శాన్వి మేఘన ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఇటీవల తాను నటించిన తమిళ సినిమా 'ప్యార్ ప్రేమ కళ్యాణం' ట్రైలర్‌ను అల్లు అర్జున్‌కు పంపగా, ఆయన దానికి ఎంతో సానుకూలంగా స్పందిస్తూ మెసేజ్ చేసినట్లు శాన్వి వెల్లడించారు. ఒక తెలుగు నటి తమిళ చిత్ర పరిశ్రమలో కూడా రాణించడం చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందంటూ బన్నీ ఆమెను అభినందించారని తెలిపారు. అల్లు అర్జున్ ఎంతగానో ప్రోత్సహించే వ్యక్తి అని ప్రశంసిస్తూ శాన్వి ఆ మెసేజ్ చూసిన తర్వాత తనకు రాత్రంతా అసలు నిద్ర పట్టలేదని తన ఆనందాన్ని పంచుకున్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com